www.prajavinikidi.com

RNI.No :TELTEL/2023/85745

# ప్రజా వినికిడి

మా అక్షరం-మీ ఆయుధం

తెలుగు దినపత్రిక

విలేకరులు కావలెను

తెలంగాణ, ఆంధ్ర రాష్ట్ర వ్యాప్తంగా వెలువడుచున్న

ప్రజా వినికిడి
మా అక్షరం-మీ ఆయుధం తెలుగు దినపత్రిక

తెలుగు దినపత్రిక నందు పనిచేయుటకు

జర్నలిజంపై ఆసక్తి కలిగిన విలేఖరులు కావలెను

ఆసక్తి గలవారు సంప్రదించండి

8978701613,7013016545

సంపుటి - 4 సంచిక -187 శనివారం 24 అక్టోబర్ 2026 ఎడిటర్ : మారేపల్లి అశోక్ పేజీలు 8 వెల - 3/- 01

Published From Hyderabad : Cerculated in Hyderabad Rangareddy,Nalgonda,Khammam,Warangal,Mahaboobnagar,Medak and All Distircts




# సమన్వయంతో నేరాలను అరికడదాం

## హైదరాబాద్ ఎస్ఆర్‌పీసీసీ సదస్సులో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి



**సైబర్ నేరాలు, మాదకద్రవ్యాల అక్రమ రవాణాపై ఉక్కుపాదం**

**సాంకేతిక పరిజ్ఞానంతో పటిష్ఠమైన పోలీసు వ్యవస్థ నిర్మాణం**

**దక్షిణ భారతదేశాన్ని సురక్షిత ప్రాంతంగా తీర్చిదిద్దాలి**

**హైదరాబాద్అక్టోబర్ 23(ప్రజావినికిడి):** దక్షిణాది రాష్ట్రాల పోలీసు బలగాల మధ్య సమన్వయాన్ని మరింత బలోపేతం చేయాలని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పిలుపునిచ్చారు. రాష్ట్రాల సరిహద్దులతో సంబంధం లేకుండా పోలీసులు పరస్పరం సమన్వయంతో పనిచేసేలా పటిష్ఠ వ్యవస్థలను ఏర్పాటు చేయాలని సూచించారు. హైదరాబాద్‌లోని 'ఇంటిగ్రేటెడ్ కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్' (ఐసీసీసీ)లో శుక్రవారం జరిగిన దక్షిణ ప్రాంతీయ పోలీసు సమన్వయ కమిటీ (ఎస్ఆర్‌పీసీసీ)

మిగతా 2లో

# కేసీఆర్ సీఎం కావడం ఖాయం

## దేశ రాజకీయాల్లో కేసీఆర్ చక్రం తిప్పే రోజులు వస్తున్నాయి: కేటీఆర్

- రేవంత్ రెడ్డి పాలన తాత్కాలికమేనని, త్వరలో కేసీఆర్ సీఎం అవుతారని ధీమా
- కాంగ్రెస్, బీజేపీయేతర కూటమి దేశంలో కీలకపాత్ర పోషిస్తుందని జోస్యం
- కరెంట్ కోతలతో రైతులు ఇబ్బంది పడుతున్నారని ప్రభుత్వంపై విమర్శ
- ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు యువత తగిన గుణపాఠం చెబుతుందన్న కేటీఆర్



**హైదరాబాద్అక్టోబర్ 23(ప్రజావినికిడి):** దేశ రాజకీయాల్లో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ కీలక పాత్ర పోషించే రోజులు దగ్గరలోనే ఉన్నాయని, ఆయన జాతీయ స్థాయిలో చక్రం తిప్పే సమయం ఆసన్నమైందని ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆశాభావం వ్యక్తం చేశారు. తెలంగాణలో రేవంత్ రెడ్డి ప్రభుత్వ హడావిడి కొద్దిరోజులు మాత్రమేనని, ఆ తర్వాత మళ్లీ కేసీఆరే ముఖ్యమంత్రి అవుతారని ఆయన ధీమా వ్యక్తం చేశారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో నిర్వహించిన అంబర్‌పేట నియోజకవర్గ బీఆర్ఎస్ ముఖ్య నేతల సమావేశంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.

మిగతా 2లో

# ప్రియాంక వర్సెస్ రాహుల్..

## బీజేపీ సంచలన ఆరోపణలు

**రైహాన్ ఎగ్జిబిషన్ వివాదంపై రాహుల్ మౌనాన్ని ప్రశ్నించిన భండారీ**

**రైహాన్ వివాదంపై ఇప్పటి వరకు బహిరంగంగా స్పందించని రాహుల్**



**న్యూ ఢిల్లీఅక్టోబర్ 23 ((ప్రజావినికిడి):** కాంగ్రెస్‌లో రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ మధ్య అంతర్గత పోరు సాగుతోందని బీజేపీ ఆరోపించింది. ప్రియాంక కుమారుడు రైహాన్ వాద్రా ఫొటో ఎగ్జిబిషన్‌లో కొన్ని చిత్రాలను తొలగించిన వివాదంపై రాహుల్ గాంధీ

మిగతా 2లో

# అరుణాచల్‌ప్రదేశ్ సరిహద్దులో చైనా కవ్వింపు

- ఘర్షణల్లో శౌర్య కమాండోలు ప్రతిభ చూపారని ప్రశంస
- చైనాతో 3,488 కిలోమీటర్ల ఎల్ఏసీకి ఐటీబీపీ కాపలా
- అన్ని సరిహద్దు యూనిట్లలో డ్రోన్ ప్లటూన్ల ఏర్పాటు
- గల్వాన్ తరహా పరిస్థితుల కోసం ప్రత్యేక శిక్షణ
- ఐటీబీపీ డీజీ శత్రుజీత్ కపూర్



2లో.

# మహారాష్ట్రతో చర్చలకు సిద్ధం కండి

## తుమ్మిడిహట్టి బ్యారేజీపై అధికారులకు సీఎం రేవంత్ ఆదేశం

**బ్యారేజీ ఎత్తు, ముంపు ప్రభావంపై సమగ్ర నివేదిక సిద్ధం చేయాలని సూచన**

**అక్టోబర్ 23 తర్వాత మహారాష్ట్ర సీఎంతో చర్చలు జరపనున్నట్టు వెల్లడి**



**హైదరాబాద్ అక్టోబర్ 23(ప్రజావినికిడి):** రాష్ట్రంలోని కీలక సాగునీటి ప్రాజెక్టుల పురోగతిపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గురువారం ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. తుమ్మిడిహట్టి బ్యారేజీ నిర్మాణంపై మహారాష్ట్ర ప్రభుత్వంతో నిర్వహించనున్న చర్చలకు సర్వసన్నద్ధంగా ఉండాలని

మిగతా 2లో

# 54 మందిపై కేసులు నమోదు

## ఏపీలో నామినేషన్ల హింస..

- 54 మందిపై కేసులు నమోదు చేశామన్న డీజీపీ
- 13 జిల్లాల్లో 31 ఘర్షణలు, దాడుల కేసుల నమోదు
- వాహనాల దహనం, జేసీబితో ఇల్లు కూల్చివేత
- ఓ అభ్యర్థిని తరలిస్తున్న పోలీసు వాహనంపై దాడి




2లో.

# మూడు దశల్లో లక్ష ఫ్లాట్ల నిర్మాణం



**ఇందిరమ్మ టవర్ల నిర్మాణంపై మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి కీలక ఆదేశాలు**

**ఈ నెలాఖరులోగా లబ్ధిదారుల ఎంపిక పూర్తి చేయాలని మంత్రి పొంగులేటి సూచన**

**లాటరీ ప్రక్రియను యూట్యూబ్‌లో ప్రత్యక్ష ప్రసారం చేసి పారదర్శకత పాటించాలని స్పష్టం**

**హైదరాబాద్అక్టోబర్ 23 (ప్రజావినికిడి):** హైదరాబాద్ కోర్ అర్బన్ రీజియన్ (క్యూర్) పరిధిలో ప్రతిపాదించిన ఇందిరమ్మ టవర్ల నిర్మాణం కోసం యుద్ధప్రాతిపదికన భూములను గుర్తించాలని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అధికారులను ఆదేశించారు. హైదరాబాద్‌లో ఉన్నతాధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు.

మిగతా 2లో




2లో.

# 100 పతకాల మార్క్ దాటిన భారత్

- ఏషియన్ పారా గేమ్స్: ప్రపంచ రికార్డుల మోత..
- ఏషియన్ పారా గేమ్స్‌లో ఐదో రోజు భారత్‌కు స్వర్ణాల పంట
- షూటర్ మోనా అగర్వాల్ ప్రపంచ రికార్డుతో రెండో స్వర్ణం కైవసం
- అథ్లెటిక్స్‌లో ప్రపంచ రికార్డులతో సందీప్ కుమార్, హనీలకు పసిడి పతకాలు
- 100 పతకాల మైలురాయిని దాటిన భారత బృందం
- బ్యాడ్మింటన్, ఆర్చరీలోనూ భారత్‌కు స్వర్ణ పతకాలు

# ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నారు

## : చంద్రబాబుపై జగన్ ఫైర్

- నామినేషన్ కేంద్రాల్లో వైసీపీ అభ్యర్థులపై దాడులు చేశారన్న జగన్
- వైసీపీ నేతలను గృహ నిర్బంధం చేస్తున్నారని మండిపాటు
- సుప్రీంకోర్టు ఆదేశాల తర్వాత కూడా ప్రభుత్వ వైఖరిలో మార్పు రాలేదని విమర్శ



2లో.

# నేడు ఢిల్లీకి చంద్రబాబు

- అర్ధరాత్రికి మళ్లీ అమరావతికి చేరుకోనున్న సీఎం
- కేంద్ర పెద్దలను కలిసే అవకాశం

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు రేపు ఢిల్లీలో పర్యటించనున్నారు. ఇది కేవలం ఒక్కరోజు పర్యటన మాత్రమే కావడం గమనార్హం.




2లో.

# సమన్వయంతో నేరాలను అరికడదాం

**(మొదటి పేజి తరువాయి)**

సమావేశంలో ఆయన మాట్లాడారు.

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కర్ణాటక, కేరళం రాష్ట్రాల డీజీపీలు, ఐజీలు, అండమాన్ నికోబార్ దీవులు, పుదుచ్చేరి, లక్షద్వీప్ ప్రతినిధులు, కేంద్ర దర్యాప్తు సంస్థల ఉన్నతాధికారులు ఈ సమావేశానికి హాజరయ్యారు. దక్షిణ భారతదేశాన్ని సురక్షిత ప్రాంతంగా తీర్చిదిద్దే బాధ్యత పోలీసు అధికారులపై ఉందని సీఎం పేర్కొన్నారు. పొరుగు రాష్ట్రాలతో సాంకేతిక పరిజ్ఞానాన్ని, ఐసీసీసీ వ్యవస్థలను పంచుకోవడానికి తెలంగాణ ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు. నేరాల స్వరూపం మారుతున్న నేపథ్యంలో పోలీసింగ్ విధానాల్లోనూ నిరంతర సంస్కరణలు అవసరమని రేవంత్‌రెడ్డి అన్నారు. పోలీసులకు కేటాయించే నిధులను ఖర్చుగా కాకుండా మెరుగైన సమాజ నిర్మాణానికి, ప్రజల భద్రతకు చేసే పెట్టుబడిగా చూడాలని చెప్పారు. ప్రజలు సమర్థంగా పనిచేసే, నైతిక విలువలను పాటించే, పక్షపాతం లేకుండా వ్యవహరించే పోలీసు వ్యవస్థను ఆశిస్తున్నారని పేర్కొన్నారు. హైదరాబాద్ పోలీసు వ్యవస్థను మూడు కమిషనరేట్లుగా పునర్వ్యవస్థీకరించామని సీఎం తెలిపారు. దీనివల్ల ప్రతి పోలీసు కమిషనర్ తన పరిధిపై ప్రత్యేకంగా దృష్టి సారించే అవకాశం ఉంటుందన్నారు. వివిధ రకాల నేరాల నియంత్రణ కోసం హైడ్రా, ఈగల్, టీ–సేఫ్ వంటి ప్రత్యేక విభాగాలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు.

సైబర్ నేరాలు, మాదకద్రవ్యాల అక్రమ రవాణా, ట్రాఫిక్ సమస్యలు ప్రస్తుతం కీలక సవాళ్లుగా మారాయని రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. వీటిని ఎదుర్కొనేందుకు సాంకేతిక పరిజ్ఞాన వినియోగం, సిబ్బందికి శిక్షణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు.

సైబర్ నేరాల నియంత్రణలో తెలంగాణ దేశంలోనే మొదటి స్థానంలో నిలిచిందని ప్రధాని అధ్యక్షతన జరిగిన ప్రగతి సమీక్ష సమావేశంలో గుర్తించినట్లు సీఎం తెలిపారు. తెలంగాణను నక్సలిజం రహిత రాష్ట్రంగా మార్చడంలో పోలీసుల కృషిని కేంద్ర హోంమంత్రి అమిత్ షా ప్రశంసించారని చెప్పారు. మాదకద్రవ్యాల నియంత్రణలో ఈగల్ విభాగానికి కేంద్ర ప్రభుత్వం 80 శాతానికి పైగా స్కోరు ఇచ్చిందన్నారు. సైబర్ నేరాల్లో బాధితులు కోల్పోయిన డబ్బును తిరిగి ఇప్పించడంలో తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో కొత్త ప్రమాణాలను నెలకొల్పుతోందని పేర్కొన్నారు. ఆహార కల్తీని అరికట్టడం, ఔషధాల నియంత్రణ కోసం అమెరికా ఎఫ్‌డీఏ తరహాలో వివిధ శాఖల మధ్య సమన్వయం కల్పించేలా టీ–సేఫ్ విభాగాన్ని ప్రారంభించినట్లు తెలిపారు. చెరువులు, సరస్సులు, ఇతర జలవనరులను పరిరక్షించి పునరుద్ధరించడంలో హైడ్రా కృషికి ప్రజల నుంచి ప్రశంసలు లభిస్తున్నాయని చెప్పారు. ప్రభుత్వ, ప్రజా ఆస్తుల పరిరక్షణకు కూడా ఈ సంస్థ పనిచేస్తోందన్నారు. హైదరాబాద్ ట్రాఫిక్ పోలీసు విభాగంలో ట్రాన్స్‌జెండర్లను ట్రాఫిక్ అసిస్టెంట్లుగా నియమించిన తొలి రాష్ట్రంగా తెలంగాణ నిలిచిందని సీఎం పేర్కొన్నారు. విధి నిర్వహణలో ప్రాణాలను సైతం పణంగా పెట్టే పోలీసు సిబ్బంది సంక్షేమం, వారి కుటుంబాల భవిష్యత్తు తనకు అత్యంత ప్రాధాన్యమని తెలిపారు. ఈ సమావేశంలో తెలంగాణ డీజీపీ సీవీ ఆనంద్, కర్ణాటక డీజీపీ ఎం.ఏ.సలీం, తమిళనాడు డీజీపీ మహేశ్ అగర్వాల్, పుదుచ్చేరి డీజీపీ షాలినీ సింగ్, లక్షద్వీప్ ఏడీజీపీ బి.శంకర్ జైస్వాల్, కేరళం ఐజీ అజితా బేగం, ఏపీ ఐజీపీ రవికృష్ణ, ఈగల్ డైరెక్టర్ సందీప్ శాండిల్య, తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో డైరెక్టర్ శిఖా గోయల్ తదితరులు పాల్గొన్నారు

# 100 పతకాల మార్క్ దాటిన భారత్

**ఏషియన్ పారా గేమ్స్: ప్రపంచ రికార్డుల మోత..**

ఐచి-నగోయా వేదికగా జరుగుతున్న 2026 ఏషియన్ పారా గేమ్స్‌లో భారత క్రీడాకారులు విశ్వరూపం ప్రదర్శిస్తున్నారు. ఐదో రోజు మన అథ్లెట్లు ప్రపంచ రికార్డుల మోత మోగించి స్వర్ణాల వర్షం కురిపించారు. ఈ అద్భుత ప్రదర్శనతో భారత్ పతకాల సంఖ్య 100 మైలురాయిని దాటింది. షూటింగ్‌లో మోనా అగర్వాల్ అద్భుతం చేసింది. మహిళల 50 మీటర్ల రైఫిల్ 3 పొజిషన్స్ ఎస్‌హెచ్1 విభాగంలో 357.5 స్కోరుతో ప్రపంచ రికార్డు సృష్టించి పసిడి పతకాన్ని కైవసం చేసుకుంది. ఈ గేమ్స్‌లో ఆమెకు ఇది రెండో స్వర్ణం కావడం విశేషం. చైనా క్రీడాకారిణి కుయిపింగ్ జాంగ్‌పై 3.8 పాయింట్ల భారీ ఆధిక్యంతో మోనా విజయం సాధించింది. అథ్లెటిక్స్‌లోనూ భారత హవా కొనసాగింది. టీ44 400 మీటర్ల స్ప్రింట్‌లో సందీప్ కుమార్ కేవలం 52.28 సెకన్లలో లక్ష్యాన్ని పూర్తి చేసి ప్రపంచ రికార్డుతో స్వర్ణం గెలుచుకున్నాడు. ఈ పతకంతో భారత్ పతకాల సంఖ్య 100 దాటింది. ఇదే ఈవెంట్‌లో అజయ్ కుమార్ 53.61 సెకన్లతో కాంస్య పతకం సాధించాడు. జావెలిన్ త్రో ఎఫ్37 విభాగంలో హనీ తన చివరి ప్రయత్నంలో 60.49 మీటర్లు విసిరి ప్రపంచ రికార్డు నెలకొల్పి స్వర్ణ పతకాన్ని ముద్దాడాడు.

ఇతర క్రీడల్లోనూ భారత్ సత్తా చాటింది. పురుషుల సింగిల్స్ ఎస్ఎల్3 బ్యాడ్మింటన్ ఆల్-ఇండియన్ ఫైనల్‌లో ప్రమోద్ భగత్‌ను ఓడించి నితేష్ కుమార్ స్వర్ణం గెలుచుకోగా, ప్రమోద్ రజతంతో సరిపెట్టుకున్నాడు. పారా ఆర్చరీ పురుషుల రికర్వ్ టీమ్ ఈవెంట్‌లో హర్విందర్ సింగ్, విజయ్ సుండి ద్వయం 5–1 తేడాతో చైనాపై గెలిచి పసిడి పతకాన్ని కైవసం చేసుకుంది.

# మూడు దశల్లో లక్ష ఫ్లాట్ల నిర్మాణం

**(మొదటి పేజి తరువాయి)**

ఈ సందర్భంగా హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్–మల్కాజ్‌గిరి జిల్లాల కలెక్టర్లతో కలిసి 'క్యూర్' ఇందిరమ్మ టవర్లు, డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పథకాల పురోగతిపై సుదీర్ఘంగా చర్చించారు.

ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ, క్యూర్ పరిధిలో మూడు దశల్లో మొత్తం లక్ష ఇందిరమ్మ ఫ్లాట్లను నిర్మించనున్నట్లు వెల్లడించారు. ప్రస్తుతం కొనసాగుతున్న మొదటి దశతో పాటు, రెండు, మూడవ దశలకు అవసరమైన భూములను త్వరితగతిన సేకరించాలని అధికారులకు సూచించారు. లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియను ఈ నెలాఖరు నాటికి అత్యంత పారదర్శకంగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఎంపిక కోసం నిర్వహించే లాటరీ ప్రక్రియను యూట్యూబ్‌లో ప్రత్యక్ష ప్రసారం చేయాలని అధికారులకు స్పష్టమైన మార్గదర్శకాలు జారీ చేశారు. నగరంలోని పేదలకు వారి నివాస ప్రాంతాలకు, ఉపాధి మార్గాలకు సమీపంలోనే గృహ వసతి కల్పించాలనేదే ఇందిరమ్మ టవర్ల ప్రధాన ఉద్దేశమని మంత్రి వివరించారు. పేదలను నగర శివార్లకు తరలించకూడదన్నదే ప్రభుత్వ లక్ష్యమని ఆయన పేర్కొన్నారు. ఈ పథకం కింద లబ్ధి పొందే వారికి ఫ్లాట్‌పై పూర్తి యాజమాన్య హక్కులతో పాటు, అవిభాజ్య భూమి వాటాను ఎటువంటి రిజిస్ట్రేషన్ ఛార్జీలు లేకుండా అందజేస్తామని హామీ ఇచ్చారు. ఇప్పటికే పలు నియోజకవర్గాల్లో ఇందిరమ్మ టవర్ల నిర్మాణానికి శంకుస్థాపనలు జరిగాయని, కొన్ని ప్రాంతాల్లో టెండర్ల ప్రక్రియ కూడా పూర్తయిందని మంత్రి గుర్తుచేశారు. లబ్ధిదారుల అర్హతలను నిశితంగా పరిశీలించిన తర్వాత బహిరంగ డ్రాల ద్వారా ఎంపిక ప్రక్రియ కొనసాగుతోందని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో ఇప్పటికే లక్షలాది ఇళ్లను మంజూరు చేసిన ఇందిరమ్మ పథకంలో భాగంగా, పట్టణ ప్రాంత గృహ నిర్మాణానికి కూడా ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందని పేర్కొన్నారు. భూముల గుర్తింపుతో పాటు ఇతర అనుబంధ ప్రక్రియలను వేగవంతం చేసి, ప్రాజెక్టుల నిర్మాణ వేగాన్ని కొనసాగించాలని అధికారులను ఆదేశించారు.

# ప్రియాంక వర్సెస్ రాహుల్.. : బీజేపీ సంచలన ఆరోపణలు

**(మొదటి పేజి తరువాయి)**

స్పందించకపోవడాన్ని ఆ పార్టీ ప్రస్తావించింది. ఈ వివాదాన్ని సృష్టించి తన కుమారుడిని రాజకీయంగా తెరపైకి తీసుకొచ్చేందుకు ప్రియాంక ప్రయత్నిస్తున్నారని బీజేపీ అధికార ప్రతినిధి ప్రదీప్ భండారీ విమర్శించారు. రాహుల్‌పై ప్రియాంకకు రాజకీయ విశ్వాసం తగ్గిందా? అని ప్రశ్నించారు. వ్యక్తిగత పర్యటన కోసం గత ఆదివారం వియత్నాం వెళ్లిన రాహుల్ గాంధీ.. రైహాన్ ఎగ్జిబిషన్ వివాదంపై ఇప్పటివరకు బహిరంగంగా స్పందించలేదు. ఈ అంశాన్ని ప్రస్తావిస్తూ కాంగ్రెస్‌లో ప్రియాంక వర్సెస్ రాహుల్ పరిస్థితి నెలకొందని భండారీ సామాజిక మాధ్యమం ఎక్స్‌లో పోస్టు చేశారు. అయితే, కొన్ని రోజుల క్రితమే ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌కు వ్యతిరేకంగా జరిగిన నిరసనల్లో రాహుల్, ప్రియాంక కలిసి పాల్గొన్న విషయం తెలిసిందే. ఢిల్లీలో ఇటీవల జరిగిన విద్యార్థుల నిరసనలకు సంబంధించిన ఫొటోలను తన ఎగ్జిబిషన్ నుంచి తొలగించారని కళాకారుడు, ఫొటోగ్రాఫర్ రైహాన్ వాద్రా బుధవారం వెల్లడించారు. 'నో ఐడియా ఈజ్ ఫైనల్' పేరుతో బికనీర్ హౌస్‌లో ఈ ప్రదర్శన ఏర్పాటు చేశారు. ఎగ్జిబిషన్ ప్రారంభానికి కొన్ని గంటల ముందు 105 ఫొటోల్లో 74 చిత్రాలను తొలగించాలని లేదా వాటి స్థానంలో వేరేవి పెట్టాలని నిర్వాహకులు కోరినట్లు రైహాన్ తెలిపారు. ప్రదర్శన ప్రారంభమయ్యే సమయానికి 35 ఫ్రేములు మాత్రమే మిగిలాయని చెప్పారు. ఈ చిత్రాల సేకరణ కోసం మూడేళ్లు కష్టపడ్డానని పేర్కొన్నారు. అక్టోబరు 15నే ఎగ్జిబిషన్ లేఅవుట్‌ను బికనీర్ హౌస్ యాజమాన్యానికి పంపించానని, దానికి సంబంధించిన అంగీకార సమాచారం కూడా అందిందని రైహాన్ వెల్లడించారు. చిత్రాల ఏర్పాట్లు ప్రారంభించిన తర్వాతే అభ్యంతరాలు వ్యక్తమయ్యాయని ఆయన తండ్రి రాబర్ట్ వాద్రా తెలిపారు. మరోవైపు, తమ ప్రాంగణ విధానాలకు అనుగుణంగా లేవని గుర్తించిన ఫొటోలను తొలగించాలని కోరినట్లు బికనీర్ హౌస్ ప్రకటించింది. ఈ వివాదంపై స్పందించిన ప్రియాంక గాంధీ.. యువత గొంతును అణచివేసే ప్రయత్నంగా అభివర్ణించారు. రైహాన్ పంపిన ఇమెయిల్, ఎగ్జిబిషన్ ప్రతిపాదనకు సంబంధించిన స్క్రీన్‌షాట్లను బీజేపీ పంచుకుంది. జూన్ 10న పంపిన ప్రతిపాదనలో ప్రకృతి, వన్యప్రాణులు, అబ్‌స్ట్రాక్ట్ ఆర్ట్, పోర్ట్రెయిట్లు, శిల్పాల వంటి అంశాలే ఉన్నాయని భండారీ పేర్కొన్నారు. అందులో రాజకీయ అంశాల ప్రస్తావన లేదని అన్నారు. జూన్ 30న బికనీర్ హౌస్ ఈ ప్రతిపాదనను అంగీకరించిందని బీజేపీ తెలిపింది. అక్టోబరు 21న బికనీర్ హౌస్ యాజమాన్యం రైహాన్‌కు నోటీసు పంపి 74 ఫొటోలను తొలగించాలని కోరినట్లు భండారీ పేర్కొన్నారు. తొలుత రాజకీయ అంశాలు లేని ప్రదర్శనకు అంగీకారం పొందిన తర్వాత, కుటుంబం ఒత్తిడితో రాజకీయ ఫొటోలను చేర్చి ఉంటారని ఆరోపించారు. ఈ ఇమెయిళ్లు, ప్రతిపాదనలు ప్రియాంక గాంధీ, కాంగ్రెస్ చేస్తున్న వాదనల్లోని అసత్యాలను బయటపెడుతున్నాయని బీజేపీ విమర్శించింది.




# కేసీఆర్ సీఎం కావడం ఖాయం

**(మొదటి పేజి తరువాయి)**

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని రంగాల్లో విఫలమైందని కేటీఆర్ ఆరోపించారు. తీవ్రమైన విద్యుత్ కోతల వల్ల రైతులు అల్లాడుతున్నారని, వారి కష్టాలను పట్టించుకోవడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని విమర్శించారు. ఎల్‌నినో ప్రభావంపై నిపుణులు పది నెలల ముందే హెచ్చరించినప్పటికీ, ప్రభుత్వం ముందస్తు చర్యలు చేపట్టడంలో విఫలమైందని మండిపడ్డారు. కాంగ్రెస్ హామీలను నమ్మి మోసపోయిన అన్ని వర్గాల ప్రజలు ఇప్పుడు మళ్లీ బీఆర్ఎస్ వైపే చూస్తున్నారని అన్నారు. రేవంత్ రెడ్డి హడావిడి మరికొద్దిరోజులు మాత్రమే ఉంటుందని కేటీఆర్ పేర్కొన్నారు.

జాతీయ రాజకీయాల గురించి ప్రస్తావిస్తూ, భవిష్యత్తులో కాంగ్రెస్, బీజేపీయేతర పార్టీలే దేశంలో నిర్ణయాత్మక పాత్ర పోషిస్తాయని కేటీఆర్ జోస్యం చెప్పారు. రాహుల్ గాంధీ ఎన్ని ప్రయత్నాలు చేసినా ఆశించిన ఫలితం ఉండదని, అటు ప్రధాని మోదీ పాలనలోనూ దేశానికి చేకూరిన ప్రయోజనం ఏమీ లేదని విమర్శించారు. రాష్ట్ర ప్రయోజనాల కోసం తెలంగాణ నుంచి గెలిచిన ఎంపీలెవరూ పార్లమెంటులో గళం విప్పడం లేదని ఆయన దుయ్యబట్టారు.

రాబోయే పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు యువత తగిన బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉందని కేటీఆర్ పేర్కొన్నారు. ప్రభుత్వ వైఫల్యాల వల్లే నేడు యువత రోడ్లపైకి వచ్చి పోరాటాలు చేయాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ నేతలు రాష్ట్ర అభివృద్ధిని విస్మరించి, కేవలం ప్రతిపక్షాలను విమర్శించడమే పనిగా పెట్టుకున్నారని ఆయన ఆరోపించారు.ం

# అరుణాచల్‌ప్రదేశ్ సరిహద్దులోచైనా కవ్వింపు

అరుణాచల్‌ప్రదేశ్ సరిహద్దులో చైనా సైనికులతో పలుచోట్ల ముఖాముఖి ఉద్రిక్తతలు కొనసాగుతున్నాయని ఇండో–టిబెటన్ బోర్డర్ పోలీస్ (ఐటీబీపీ) డైరెక్టర్ జనరల్ శత్రుజీత్ కపూర్ వెల్లడించారు. ఈశాన్య సరిహద్దులో ప్రస్తుత పరిస్థితిపై అధికారికంగా ఈ స్థాయిలో వెల్లడించడం ఇదే తొలిసారి అని సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి. "గత కొన్ని రోజులుగా అరుణాచల్‌లో పలుచోట్ల చైనా సైనికులతో ముఖాముఖి పరిస్థితులు ఏర్పడ్డాయి. అవి ఇంకా కొనసాగుతున్నాయి" అని ఐటీబీపీ సిబ్బంది వార్షిక సత్కార కార్యక్రమంలో కపూర్ తెలిపారు. ఈ పరిణామాల్లో ఐటీబీపీకి చెందిన శౌర్య కమాండోలు అసాధారణ ప్రతిభ కనబరిచారని ప్రశంసించారు.

ఎత్తైన పర్వత ప్రాంతాల్లో యుద్ధం చేయడంలో ప్రత్యేక శిక్షణ పొందినవారే శౌర్య కమాండోలు. సరిహద్దుల్లో వీరు కీలక పాత్ర పోషిస్తున్నారని ఐటీబీపీ చీఫ్ చెప్పారు. 1962లో ఏర్పాటైన ఈ బలగం చైనాతో ఉన్న 3,488 కిలోమీటర్ల వాస్తవాధీన రేఖ (ఎల్ఏసీ) వెంబడి కాపలా బాధ్యతలు చూస్తుంటుంది. 2004లో సరిహద్దు రక్షణ బాధ్యతలు అప్పగించినప్పటికీ, పర్వత ప్రాంతాల్లో గెరిల్లా యుద్ధానికి సంబంధించిన తమ అసలు నైపుణ్యాన్ని కొనసాగించాల్సిన అవసరం ఉందని కపూర్ పేర్కొన్నారు.

చైనాతో ఉన్న సరిహద్దు అత్యంత క్లిష్టమైనదని ఐటీబీపీ డీజీ అభిప్రాయపడ్డారు. సరిహద్దు ప్రాంతాల్లోని అన్ని యూనిట్లలో డ్రోన్ ప్లటూన్లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. గల్వాన్ లోయ తరహా పరిస్థితులను సమర్థంగా ఎదుర్కొనేందుకు ప్రత్యేక పోరాట శిక్షణ కార్యక్రమాన్ని రూపొందించినట్లు చెప్పారు. భూగర్భ మౌలిక సదుపాయాలను కూడా అభివృద్ధి చేస్తున్నట్లు వెల్లడించారు.

అయితే తాజా ముఖాముఖి ఘటనలు ఏ ప్రాంతాల్లో జరిగాయి? ఎంతమంది సైనికులు పాల్గొన్నారు? ఎలాంటి పరిణామాలు చోటుచేసుకున్నాయి? అనే వివరాలను ఐటీబీపీ చీఫ్ వెల్లడించలేదు.

## ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నారు: చంద్రబాబుపై జగన్ ఫైర్

**అమరావతిఅక్టోబర్ 23 (ప్రజావినికిడి):**

ఆంధ్రప్రదేశ్‌లో జరుగుతున్న స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియలో ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నారని వైసీపీ అధినేత జగన్ ఆరోపించారు. రాష్ట్రంలో రావణకాసుర పాలన నడుస్తోందని ఆయన మండిపడ్డారు. నామినేషన్ కేంద్రాల వద్ద వైసీపీ అభ్యర్థులపై దాడులు చేసి, వారి నామినేషన్ పత్రాలను చించివేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ పార్టీ నేతలను పోలీసులు గృహ నిర్బంధం చేయడం, పోలీస్ స్టేషన్లకు పిలిపించడం వంటి చర్యలకు పాల్పడుతున్నారని విమర్శించారు. ఈ అక్రమాలపై తాము ఆధారాలు సేకరించి రాష్ట్ర ఎన్నికల సంఘం (ఎస్ఈసీ), గవర్నర్‌తో పాటు సుప్రీంకోర్టును కూడా ఆశ్రయించామని తెలిపారు. తమ పిటిషన్‌పై స్పందించిన సుప్రీంకోర్టు, అభ్యర్థుల తుది జాబితా ప్రకటనను అక్టోబర్ 25 వరకు వాయిదా వేయాలని, నామినేషన్ల దాఖలుకు స్వేచ్ఛ కల్పించాలని, అభ్యర్థులకు రక్షణ, సీసీటీవీ రికార్డింగ్ ఏర్పాటు చేయాలని స్పష్టమైన ఆదేశాలు ఇచ్చిందని జగన్ గుర్తుచేశారు. అయినప్పటికీ ప్రభుత్వ యంత్రాంగం వైఖరిలో ఎలాంటి మార్పు రాలేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలోని 19 మున్సిపాలిటీలలో తమ అభ్యర్థులు నామినేషన్లు వేయకుండా అడ్డుకున్నారని, కానీ ఎస్ఈసీ కేవలం పరిమిత సంఖ్యలో కొన్ని చోట్ల మాత్రమే రీ–నామినేషన్లకు అవకాశం ఇచ్చిందని జగన్ అసంతృప్తి వ్యక్తం చేశారు. ఏకపక్ష విజయాల కోసం చంద్రబాబు నిబంధనలు మార్చుతున్నారని, ఇది మహాభారతంలోని మాయాజూదాన్ని తలపిస్తోందని ఆయన విమర్శించారు.

# నేడు ఢిల్లీకి చంద్రబాబు

**అమరావతిఅక్టోబర్ 23:(ప్రజావినికిడి):**

నేడు మధ్యాహ్నం అమరావతి నుంచి ప్రత్యేక విమానంలో ఢిల్లీకి బయలుదేరి, అక్కడ అధికారిక కార్యక్రమాలు ముగించుకుని అదే రోజు అర్ధరాత్రికి తిరిగి అమరావతి చేరుకుంటారు.

ఈ పర్యటనలో భాగంగా ముఖ్యమంత్రి చంద్రబాబు కేంద్ర ప్రభుత్వంలోని పలువురు ముఖ్య నేతలతో భేటీ అయ్యే అవకాశం ఉందని రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి. రాష్ట్రానికి సంబంధించిన అభివృద్ధి కార్యక్రమాలు, పెండింగ్ అంశాలు, కేంద్రం నుంచి రావాల్సిన నిధులపై చర్చించే వీలుంది. అలాగే ఢిల్లీలోని జన్‌పథ్‌లో జరగనున్న ఒక ప్రత్యేక అధికారిక కార్యక్రమంలో ఆయన పాల్గొంటారని తెలుస్తోంది. అయితే, ఢిల్లీ పర్యటనకు సంబంధించిన పూర్తి షెడ్యూల్, ఎవరెవరితో సమావేశమవుతారనే వివరాలు అధికారికంగా వెలువడాల్సి ఉంది.

# మహారాష్ట్రతో చర్చలకు సిద్ధం కండి

**(మొదటి పేజి తరువాయి)**

అధికారులను ఆదేశించారు. రైతుల ప్రయోజనాలే పరమావధిగా ప్రాజెక్టుల పనులను వేగవంతం చేయాలని ఆయన స్పష్టం చేశారు. ఈ సమావేశంలో ప్రధానంగా తుమ్మిడిహట్టి, దిండి, అచ్చంపేట ఎత్తిపోతల పథకాలపై చర్చించారు. తుమ్మిడిహట్టి బ్యారేజీని 152 మీటర్ల ఎత్తులో నిర్మిస్తే ఎల్లంపల్లి వరకు నీటిని తరలించే అవకాశం ఉంటుందని, అయితే దీనివల్ల సుమారు 2,300 ఎకరాల మేర ముంపునకు గురవుతుందని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. అదే 150 మీటర్ల ఎత్తులో నిర్మిస్తే ముంపు వెయ్యి ఎకరాల లోపే మాత్రమే ఉంటుందని తెలిపారు. దీనిపై స్పందించిన సీఎం, మహారాష్ట్రలో ముంపు ప్రభావాన్ని అంచనా వేస్తూనే, తెలంగాణకు గరిష్ఠంగా నీటి లభ్యత ఉండేలా బ్యారేజీ డిజైన్‌ను రూపొందించాలని సూచించారు. అక్టోబర్ 23 తర్వాత చర్చలకు సిద్ధంగా ఉన్నట్లు మహారాష్ట్ర ముఖ్యమంత్రి సంకేతాలిచ్చారని రేవంత్ రెడ్డి ఈ సందర్భంగా తెలిపారు. ఇటీవల కేంద్ర జల సంఘం (సీడబ్ల్యూసీ) ఆధ్వర్యంలో రెండు రాష్ట్రాల మధ్య జరిగిన సమావేశ వివరాలతో పాటు, సీడబ్ల్యూసీ కోరే ఎలాంటి సమాచారానికైనా సిద్ధంగా ఉండాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. దిండి ప్రాజెక్టుకు సంబంధించి ఏదుల రిజర్వాయర్ నుంచి 0.5 టీఎంసీలు, అచ్చంపేట ఎత్తిపోతల పథకానికి 0.1 టీఎంసీల నీటిని తరలించేందుకు ఏర్పాట్లు చేయాలని సీఎం ఆదేశించారు. శ్రీశైలం నుంచి అదనంగా 0.6 టీఎంసీల నీటిని తీసుకునేందుకు, శ్రీశైలం, నార్లాపూర్ నుంచి ఏదుల రిజర్వాయర్‌కు నీటిని మళ్లించేందుకు ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ సమావేశంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, జూపల్లి కృష్ణారావు, డి. శ్రీధర్ బాబు, సాగునీటి పారుదల శాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# ఏపీలో నామినేషన్ల హింస..
# 54 మందిపై కేసులు నమోదు చేశామన్న డీజీపీ

**రాష్ట్రవ్యాప్తంగా 13 జిల్లాల్లో 31 ఘర్షణలు, దాడుల కేసుల నమోదు**

**వాహనాల దహనం, జేసీబీతో ఇల్లు కూల్చివేత**

**ఓ అభ్యర్థిని తరలిస్తున్న పోలీసు వాహనంపై దాడి**

**అమరావతిఅక్టోబర్ 23(ప్రజావినికిడి):**

ఆంధ్రప్రదేశ్‌లో ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ హింసాత్మకంగా మారింది. రాష్ట్రవ్యాప్తంగా పలుచోట్ల ఘర్షణలు, దాడులు చోటుచేసుకోవడంతో, ఈ ఘటనలపై డీజీపీ హరీశ్ కుమార్ గుప్తా తీవ్రంగా స్పందించారు. ఎన్నికల ప్రక్రియలో హింసకు పాల్పడేవారు, నామినేషన్లను అడ్డుకునేవారు ఏ పార్టీకి చెందినవారైనా కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. నిన్న ఒక్కరోజే 13 జిల్లాల్లో 31 ఘటనలు నమోదైనట్లు వెల్లడించారు.

ఈ ఘటనల్లో 22 హింసాత్మక ఘర్షణలు కాగా, 9 నామినేషన్ పత్రాలను చించివేయడం లేదా లాక్కోవడం వంటివి ఉన్నాయి. అత్యధికంగా అనంతపురం జిల్లాలో 8 ఘటనలు జరిగాయి. అన్నమయ్య, కడప, ప్రకాశం జిల్లాల్లో మూడేసి హింసాత్మక ఘటనలు చోటుచేసుకున్నాయి. ఈ దాడుల్లో రెండు కార్లు, రెండు మోటార్‌సైకిళ్లు సహా నాలుగు వాహనాలకు నిప్పు పెట్టారు. రాళ్లు, కర్రలతో దాడులు, ఒకచోట జేసీబీతో ఇంటిని కూల్చివేయడం, గాల్లోకి కాల్పులు జరపడం వంటి ఘటనలు ఉద్రిక్తతకు దారితీశాయి. ఓ అభ్యర్థిని తరలిస్తున్న పోలీసు వాహనంపై జరిగిన రాళ్లదాడిలో కానిస్టేబుల్‌కు తలకు తీవ్రగాయమైంది. ఒక అభ్యర్థితో సహా మరో వ్యక్తి పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. ఈ ఘటనలకు సంబంధించి ఇప్పటివరకు 16 కేసులు నమోదు చేసి, 54 మంది నిందితులను గుర్తించినట్లు డీజీపీ తెలిపారు. నిందితులు టీడీపీ, వైసీపీ, సీపీఎం, స్వతంత్రులుగా ఉన్నారని, పార్టీలతో సంబంధం లేకుండా అందరిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. పెండింగ్ కేసులను వెంటనే నమోదు చేసి నిందితులను అరెస్ట్ చేయాలని, సున్నితమైన కేంద్రాల్లో అదనపు బలగాలను మోహరించాలని జిల్లా అధికారులను ఆదేశించారు. ఎలాంటి బెదిరింపులు లేదా హింసకు గురైనా వెంటనే డయల్ 100 లేదా 112కు ఫిర్యాదు చేయాలని ప్రజలకు సూచించారు.

ప్రజా వినికిడి
మా అక్షరం-మీ ఆయుధం
తెలుగు దినపత్రిక
శనివారం 24 అక్టోబర్ 2026

## జోయాలుక్కాస్ వనస్థలిపురం షోరూమ్ 2026 అక్టోబర్ 23 నుండి
## 'బ్రిలియన్స్ డైమండ్ జ్యువెలరీ షో'తో మెరిసిపోనుంది.



**వనస్థలిపురం, (ప్రజావినికిడి):**
జోయాలుక్కాస్, ద వరల్డ్స్ ఫేవరెట్ జ్యువెలర్ వనస్థలిపురంలోని ఉన్న తమ షోరూమ్‌లో 2026 అక్టోబర్ 23 నుండి 'బ్రిలియన్స్ డైమండ్ జ్యువెలరీ షో'తో హైదరాబాద్ ను మెరిపించడానికి సిద్ధమైంది.ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న ఈ ప్రదర్శన, వజ్రాభరణాలలో నైపుణ్యం, సొబగులు, సరికొత్త ఆవిష్కరణల అపురూప వేడుకను అందిస్తుంది.పెళ్లిళ్ళకు వాడే అద్భుతమైన నగల సెట్‌ల నుండి నిత్యం ధరించే ఆధునిక ఆభరణాల వరకు,ఈ షోలో కాలాతీతమైన సంప్రదాయం, ఆధునికత కలగలిసిన ఆభరణాలు లభ్యమవుతాయి.ప్రతి డిజైన్ ఒక కళాఖండం,ఈ షో జరిగే పరిమిత కాలం వరకు మాత్రమే అందుబాటులో ఉంటుంది.పెళ్లిళ్ళకు వాడే అద్భుతమైన నగల సెట్‌ల నుండి నిత్యం ధరించే ఆధునిక ఆభరణాల వరకు,ఈ షోలో కాలాతీతమైన సంప్రదాయం, ఆధునికత కలగలిసిన ఆభరణాలు లభ్యమవుతాయి.ప్రతి డిజైన్ ఒక కళాఖండం,ఈ షో జరిగే పరిమిత కాలం వరకు మాత్రమే అందుబాటులో ఉంటుంది.ఈ సందర్భాన్ని పురస్కరించుకుని,ప్రదర్శన సమయంలో 1 లక్ష రూపాయలు మరియు అంతకంటే ఎక్కువ విలువైన వజ్రాభరణాలు కొనుగోలు చేసిన ప్రతి వినియోగదారుడికి ఒక ఉచిత బంగారు నాణెం లభిస్తుంది.ఇది షాపింగ్ అనుభవానికి మరింత మెరుపును జోడిస్తుంది.ఈ సందర్భాన్ని పురస్కరించుకుని, ప్రదర్శన సమయంలో 1 లక్ష రూపాయలు మరియు అంతకంటే ఎక్కువ విలువైన వజ్రాభరణాలు కొనుగోలు చేసిన ప్రతి వినియోగదారుడికి ఒక ఉచిత బంగారు నాణెం లభిస్తుంది.ఇది షాపింగ్ అనుభవానికి మరింత మెరుపును జోడిస్తుంది.

## షాద్ నగర్ నుంచి మహా పాదయాత్రగా బయలుదేరిన అయ్యప్ప స్వాములు



**షాద్‌నగర్,(ప్రజావినికిడి):**అయ్యప్ప స్వాముల మహాపాదయాత్ర భక్తిశ్రద్ధలతో, ఆధ్యాత్మిక వాతావరణంలో ప్రారంభమైంది.సురేష్ గురుస్వామి,రమేష్ గురుస్వామి,శ్రీను గురుస్వామి ఆధ్వర్యంలో చేపట్టిన ఈ మహాపాదయాత్రకు షాద్‌నగర్‌లోని శివమారుతి ఆలయంలో గిరీష్ నాయర్ గురుస్వామి,లక్ష్మయ్య గురుస్వామి ఇరుముడి కట్టి, ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం అయ్యప్ప స్వాములు పాదయాత్రగా బయలుదేరారు.ఈ సందర్భంగా పాల్గొన్న నెల్లి శ్రీవర్ధన్ రెడ్డి మాట్లాడుతూ,అయ్యప్ప మాలాధారణ అత్యంత విశిష్టమైన ఆధ్యాత్మిక దీక్ష అని,నియమనిష్ఠలు,క్రమశిక్షణ, భక్తిభావంతో కూడుకున్నదని పేర్కొన్నారు.దీక్షా సమయంలో అలవర్చుకున్న మంచి అలవాట్లను జీవితాంతం కొనసాగించాలని సూచించారు.అయ్యప్ప దీక్ష వ్యక్తిగత జీవితంలో ఆధ్యాత్మిక ఆనందాన్ని అందించడంతో పాటు కుటుంబంలో సుఖశాంతులకుదోహదపడుతుందని అన్నారు.అయ్యప్ప స్వాములు దీక్ష ద్వారా అలవర్చుకున్న క్రమశిక్షణ,సేవాభావం, ఐకమత్యం వంటి సద్గుణాలను సమాజ శ్రేయస్సుకు,హిందూ ధర్మ పరిరక్షణకు వినియోగించాలని పిలుపునిచ్చారు.మహాపాదయాత్ర నిర్వహణకు రూ.50 వేల ఆర్థిక సహాయం అందించిన నెల్లి శ్రీవర్ధన్ రెడ్డికి అయ్యప్ప స్వాముల ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉంటాయని సురేష్ గురుస్వామి అన్నారు.హిందూ ధర్మ పరిరక్షణ కోసం నిరంతరం నిలబడే వ్యక్తి నెల్లి శ్రీవర్ధన్ రెడ్డి అని కొనియాడారు.ఈ మహాపాదయాత్ర విజయవంతం కావడానికి పలువురు సహకారం అందించారని,సహకరించిన ప్రతి ఒక్కరికీ అయ్యప్ప స్వామి కృపాకటాక్షాలు ఉండాలని ఆకాంక్షించారు.గిరీష్ నాయర్ స్వామి ఇరుముడితో ప్రారంభమైన ఈ మహాపాదయాత్రలో అయ్యప్ప స్వాములు భజనలు, భక్తిగీతాలు,నృత్యాలతో ఉత్సాహంగా ముందుకు సాగారు.ప్రధాన రహదారిపై భక్తిశ్రద్ధలతో కొనసాగిన ఈ పాదయాత్ర స్థానికులను, భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి.

## జాతీయ స్థాయి అండర్-17 పోటీలకు ప్రజ్ఞ రాజ్ ఎంపిక






**అంబర్ పేట్, (ప్రజావినికిడి):**
హన్మకొండకు చెందిన దండుగుల ప్రజ్ఞ రాజ్ జాతీయ స్థాయి అండర్-17 బాలికల క్రికెట్ పోటీలకు తెలంగాణ జట్టు తరఫున ఎంపికైంది. జమ్మూ కాశ్మీర్‌లో నవంబర్ 15 నుంచి 20 వరకు నిర్వహించనున్న 70వ జాతీయ పాఠశాలల క్రీడా సమాఖ్య అండర్-17 బాలికల క్రికెట్ పోటీల్లో ప్రజ్ఞ రాజ్ తెలంగాణ జట్టుకు ప్రాతినిధ్యం వహించనుంది.ప్రజ్ఞ రాజ్ సిద్దిపేట జిల్లా గజ్వేల్ రూరల్ సర్కిల్‌లో సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్న రవిరాజుసుష్మ దంపతుల కుమార్తె. హైదరాబాద్‌లోని నల్లకుంట గురుదత్త హైస్కూల్‌లో 9వ తరగతి చదువుతున్న ఆమె, నగరంలోని నెక్సాన్ (చీవ×స్త్రశీఅ) క్రికెట్ అకాడమీలో ప్రత్యేక శిక్షణ పొందుతోంది. కుడిచేతి వాటం బ్యాటర్‌గా,లెగ్ స్పిన్ బౌలర్‌గా ఆల్‌రౌండ్ ప్రతిభ కనబరుస్తూ వివిధ స్థాయిల్లో విజయాలు సాధిస్తోంది.

**గతంలోనూ పలు విజయాలు**

2025 జనవరిలో యువ క్రీడాకారులను ప్రోత్సహించే "రాజా అండర్-14 పోటీల్లో తెలంగాణ జట్టుకు ఎంపికైన ప్రజ్ఞా రాజ్,గత ఏడాది నవంబర్‌లో తెలంగాణ స్కూల్ క్రికెట్ అసోసియేషన్ నిర్వహించిన అండర్-16 టీ20 ఇండియా-శ్రీలంక ఫ్రెండ్‌షిప్ కప్‌లో శ్రీలంక జట్టుపై ప్రతిభ కనబరిచి అవార్డు అందుకుంది.హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ నిర్వహించిన రాష్ట్రస్థాయి అండర్ -15 మహిళల క్రికెట్ పోటీల్లో నూ ఆమె తన ప్రతిభను చాటుకుంది. 2026 ఫిబ్రవరిలో వరంగల్ లో జరిగిన ఉమ్మడి జిల్లాల సీనియర్ మహిళల క్రికెట్ పోటీల్లో వరంగల్ జట్టు తరఫున పాల్గొని జట్టును విజేతగా నిలపడం లో కీలక పాత్ర పోషించింది.గత రెండేళ్లుగా పాఠశాలల క్రీడా సమాఖ్య నిర్వహించిన అండర్-17, అండర్-19 బాలికల రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీలకు వరంగల్ జిల్లా తరఫున ఎంపికై మంచి ప్రదర్శన కనబరిచింది.

**ఐదు వికెట్లతో సత్తా చాటి జాతీయ జట్టుకు ఎంపిక**

ఇటీవల సిరిసిల్లలో నిర్వహించిన రాష్ట్రస్థాయి అండర్-17 బాలికల క్రికెట్ పోటీల్లో హైదరాబాద్ జిల్లా జట్టు తరఫున ఆడిన ప్రజ్ఞ రాజ్ ఆల్‌రౌండ్ ప్రదర్శనతో ఆకట్టుకుంది. ముఖ్యంగా మహబూబ్‌నగర్ జిల్లా జట్టుతో జరిగిన మ్యాచ్‌లో కేవలం రెండు ఓవర్లలో ఐదు వికెట్లు పడగొట్టి అద్భుతమైన బౌలింగ్ ప్రదర్శన చేసింది.ఈ టోర్నీలో హైదరాబాద్ జట్టు మూడో స్థానం సాధించి కాంస్య పతకాన్ని అందుకుంది. ప్రజ్ఞరాజ్ కనబరిచిన అత్యుత్తమ బౌలింగ్ ప్రతిభ, ఆల్‌రౌండ్ ప్రదర్శన ఆధారంగా తెలంగాణ అండర్-17 బాలికల జట్టుకు ఎంపికైనట్లు కరీంనగర్ జిల్లా పాఠశాలల క్రీడా సమాఖ్య కార్యదర్శి జోగిపల్లి రవీందర్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు.వచ్చే నెల నవంబర్ 15 నుంచి 20 వరకు జమ్మూ కాశ్మీర్‌లో జరిగే జాతీయస్థాయి పోటీల్లో తెలంగాణ తరఫున ఆడి రాష్ట్రానికి మరిన్ని విజయాలు అందించాలని క్రీడాభిమానులు ఆకాంక్షిస్తున్నారు.ప్రజ్ఞ రాజ్ సాధించిన విజయాల పట్ల గురుదత్త హైస్కూల్ ప్రిన్సిపాల్ రేణుక, ఉపాధ్యాయులు, పాఠశాల సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు. భవిష్యత్తులోనూ ఆమె మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించి రాష్ట్రానికి, దేశానికి పేరు ప్రఖ్యాతులు తీసుకురావాలని అభిలాశించారు.

## జడ్జిగా ఎంపికైన అగిరు లక్ష్మీ ప్రసాద్ ను అభినందించిన ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి



**షాద్ నగర్,(ప్రజావినికిడి):**జూనియర్ సివిల్ జడ్జిగా షాద్ నగర్ ప్రాంతవాసి ఆగీరు లక్ష్మీప్రసాద్ ఎంపిక కావడం పట్ల ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి షాద్ నగర్ పట్టణంలోని వారి నివాసానికి వెళ్లి అగిరు లక్ష్మీ ప్రసాద్‌ని శాలువాతో సత్కరించి,ప్రత్యేక శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ,న్యాయ వాదిగా విధులు నిర్వహిస్తూ కష్టపడి చదివి జూనియర్ సివిల్ జడ్జిగా ఎంపిక కావడం లక్ష్మీ ప్రసాద్ ప్రతిభకు,నిరంతర కృషికి దక్కిన గౌరవమని కొనియాడారు.న్యాయవ్యవస్థలో ఎంతో బాధ్యతాయుతమైన ఈ పదవిని చేపట్టబోతున్న ఆయన,భవిష్యత్తులో ప్రజలకు నిష్పక్షపాతంగా న్యాయం అందిస్తూ,ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు.ఈ సత్కార కార్యక్రమంలో షాద్ నగర్ బార్ అసోసియేషన్ అధ్యక్షులు బీరంగూడా జగన్మోహన్ రెడ్డి,మాజీ కౌన్సిలర్లు కానుగు అనంతయ్య,నందకిషోర్,షాద్ నగర్ పట్టణ ఆర్యవైశ్య అధ్యక్షులు మలిపెద్ది శ్రీనివాస్ గుప్తా,మాజీ సర్పంచ్ అజయ్ నాయక్,నాయకులు దండు రాము,హర్ష వర్ధన్ రెడ్డి,అన్వారీ రాజు,శంకర్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## పేదల భూములను పరిశ్రమలు,ప్రాజెక్టుల పేరుతో
# లాక్కుంటే సహించేది లేదు

**భూములను కోల్పోయిన వ్యవసాయదారులు,కంపెనీల ముందు కాపలాదారులుగా మారే అవకాశం ఉంది**

**జిల్లా కలెక్టర్,ఆర్డిఒలకు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేసిన చర్యలు శూన్యం**

**రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించిన టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు,మాజీ ఎమ్మెల్యే బక్కని నర్సింహులు**

**షాద్ నగర్,(ప్రజావినికిడి):** తెలంగాణ రాష్ట్రంలో నిరుపేదలకు జీవనాధారంగా ఉన్న వ్యవసాయ భూములను పరిశ్రమలు,ప్రాజెక్టులు,అభివృద్ధి,డంపింగ్ యార్డుల పేరుతో బలవంతంగా లాక్కోవాలని చూస్తే సహించేది లేదని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర పొలిట్‌బ్యూరో సభ్యుడు, షాద్‌నగర్ మాజీ ఎమ్మెల్యే బక్కని నర్సింహులు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. షాద్‌నగర్ పట్టణంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశం.ఈ సందర్భంగా బక్కని నరసింహులు మాట్లాడుతూ,
పేదల భూముల పరిరక్షణ,వాగుల సహజ ప్రవాహం,భూసేకరణ అంశాలపై తన అభిప్రాయాలను వెల్లడించారు.గత ప్రభుత్వాలు భూసంస్కరణలు,భూదాన ఉద్యమాల ద్వారా నిరుపేదలకు పంపిణీ చేసిన భూములను నేడు పరిశ్రమలు,ఇతర ప్రాజెక్టుల పేరుతో కంపెనీలకు అప్పగించే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆయన ఆరోపించారు.
పేదలకు జీవనోపాధి కల్పించేందుకు ఇచ్చిన భూములను తిరిగి స్వాధీనం చేసుకోవడం అన్యాయమని అన్నారు.జిల్లా కలెక్టర్,ఆర్డిఒలకు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేసిన చర్యలు శూన్యం..ఎలికట్ట గ్రామంలోనే లాడోని చెరువు మీదుగా బొబ్బిలి చెరువు ద్వారా నాగులపల్లి వాగు సహజ ప్రవాహాన్ని మళ్లించే వ్యవహారంలో అధికారుల తీరు ఆందోళనకరంగా ఉందని బక్కని నర్సింహులు పేర్కొన్నారు.నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తూ నిరభ్యంతర పత్రాలు జారీ చేసి బాధ్యతల నుంచి తప్పించుకోవాలని చూడటం సరికాదన్నారు.ఈ అంశంపై రంగారెడ్డి జిల్లా కలెక్టర్,ఆర్డీఒ లకు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేసినప్పటికీ పూర్తిస్థాయిలో చర్యలు



తీసుకోకపోవడం శోచనీయమని అన్నారు.సిద్ధాపూర్ గ్రామంలోని సర్వే నంబర్లు 361,252,278 పరిధిలో దాదాపు 233 ఎకరాల్లో డంపింగ్ యార్డు ఏర్పాటుకు సన్నాహాలు చేస్తున్నారని ఆయనఆరోపించారు.అదేవిధంగా చేవెళ్ల నియోజకవర్గ పరిధిలోని సీతారాంపూర్ గ్రామంలో వెయ్యి ఎకరాల దేవాదాయ భూమిని గత ప్రభుత్వం కంపెనీలకు కట్టబెట్టిందని,
తిమ్మారెడ్డి గూడెంలో సర్వే నంబర్ 483లో 153ఎకరాలు, లింగారెడ్డిగూడలో సర్వే నంబర్ 287లో 119 ఎకరాలు,కొందన్నగూడ,కమ్మదనం ప్రాంతాల్లోని భూములను పరిశ్రమల పేరుతో సేకరించాలని చూడటంపై అభ్యంతరం వ్యక్తం చేశారు.కులమతాలకు అతీతంగా నిరుపేదల వద్ద ఉన్న కొద్దిపాటి భూమిని సైతం లాక్కుంటే వారి కుటుంబాలు జీవనాధారం కోల్పోయి రోడ్డున పడే ప్రమాదం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు.
ఉద్యోగాల కంటే భూములే తరతరాల జీవనాధారం
పేదల భూములు తీసుకొని ఏర్పాటుచేసిన కంపెనీలలో కల్పించే ఉద్యోగాలు ఒక తరానికి మాత్రమే పరిమితమైతాయని,అదే వ్యవసాయ భూమి మాత్రం తరతరాలుగా కుటుంబాలకు జీవనాధారంగా నిలుస్తుందని బక్కని నర్సింహులు అన్నారు. భూములు కోల్పోయిన స్థానికులు తమ సొంత ప్రాంతాల్లోనే కూలీలుగా, కాపలాదారులుగాపనిచేయాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని హెచ్చరించారు.
గతంలో ఈస్ట్ ఇండియా కంపెనీ వ్యాపారం పేరుతో దేశంలోకి ప్రవేశించి దోపిడీకి పాల్పడి 200 సంవత్సరాలు దేశాన్ని ఏలినట్టుగా,నేడు కార్పొరేట్ సంస్థల ప్రయోజనాల కోసం పచ్చని పొలాలను బలిచేయడం సమంజసం కాదని వ్యాఖ్యానించారుపేదల భూముల పరిరక్షణకు రాష్ట్ర ముఖ్యమంత్రి జోక్యం చేసుకోవాలి
ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన నాయకుడిగా, ప్రస్తుతం ముఖ్యమంత్రిగా ఉన్న రేవంత్ రెడ్డి ఈ వ్యవహారంలో తక్షణమే జోక్యం చేసుకోవాలని బక్కని నర్సింహులు విజ్ఞప్తి చేశారు.లక్ష్మీదేవునిపల్లి ప్రాజెక్టు నిర్మాణం చేసి,ప్రాజెక్టు ద్వారా గోదావరి,కృష్ణా జలాలను అనుసంధానం చేసి సాగునీరు అందిస్తామని చెబుతున్న ప్రభుత్వం,మరోవైపు రైతుల భూములను సేకరించేందుకు ప్రయత్నిస్తే ఆ నీటిని ఎవరు వినియోగించుకుంటారని ప్రశ్నించారు.నిరుపేదలకు జీవనాధారమైన భూములను కాపాడటంతో పాటు పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యం ఇవ్వాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు.పేదల హక్కులకు భంగం కలిగించే భూసేకరణ చర్యలను నిలిపివేసి,సంబంధిత సమస్యలపై సమగ్ర విచారణ జరిపి స్థానికంగా ఉన్న రైతాంగానికి,ప్రజలకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

## విద్యార్థులకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన

**రోడ్డు ప్రమాదాల నివారణకు నిబంధనలు పాటించాలి..**

**షాద్ నగర్ ట్రాఫిక్ సిఐ వెంకటేశ్వర్లు..**



**షాద్‌నగర్,(ప్రజావినికిడి):**
రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని షాద్‌నగర్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ ఎస్. వెంకటేశ్వర్లు సూచించారు.పోలీస్ ఫ్లాగ్ డే వీక్2026లో భాగంగా శుక్రవారం షాద్‌నగర్ పట్టణంలోని మాంటిస్సోరి ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ విద్యార్థులకు ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో ఓపెన్ హౌస్ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పనితీరు, పోలీసుల విధులు,బాధ్యతలను విద్యార్థులకు వివరించారు. ట్రాఫిక్ నియంత్రణలో ఉపయోగించే బ్రీత్ అనలైజర్లు, కెమెరాలు,ట్యాబ్లెట్లు,బ్యాటన్లు, రిఫ్లెక్టివ్ జాకెట్లు,హెల్మెట్లు, మ్యాన్‌ప్యాక్‌ల వినియోగాన్ని ప్రత్యక్షంగా చూపించారు.రోడ్డు ప్రమాదాలకు దారితీసే కారణాలను వివరిస్తూ, ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలనుఉల్లంఘించకుండా రహదారి భద్రతకు ప్రాధాన్యమివ్వాలని సూచించారు.
విద్యార్థులు తమ కుటుంబ సభ్యులు, స్నేహితులకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించాలని కోరారు.ప్రజల్లో రహదారి భద్రతపై చైతన్యంపెంపొందించడంతోపాటు,విద్యార్థులకు పోలీసుల విధులు,ట్రాఫిక్ నియంత్రణపై అవగాహన కల్పించడమే కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని పోలీసులు తెలిపారు

# రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి..

**ప్రమాదాలు అధికంగా జరిగే ప్రాంతాల్లో భద్రతా చర్యలు చేపట్టాలి..**

**జిల్లా అదనపు కలెక్టర్ డాక్టర్ కె. కిరణ్మయి**








**రంగారెడ్డి,(ప్రజావినికిడి):**
రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని, ప్రజల్లో అవగాహన పెంపొందించడం ద్వారా ప్రమాదాలను గణనీయంగా తగ్గించవచ్చని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) డాక్టర్ కె. కిరణ్మయి తెలిపారు.
శుక్రవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ భవనంలోని సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్ డాక్టర్ కె.కిరణ్మయి ఆధ్వర్యంలో రోడ్డు భద్రతా కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన చర్యలు, ప్రమాదాలు అధికంగా జరుగుతున్న ప్రాంతాలు, భద్రతా ఏర్పాట్లపై సంబంధిత అధికారులతో సమగ్రంగా సమీక్షించారు. పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ప్రమాదాలు అధికంగా జరుగుతున్న ప్రాంతాల వివరాలను పరిశీలించి, ప్రమాదాల నియంత్రణకు చేపట్టాల్సిన చర్యలపై చర్చించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణకు పోలీస్, మున్సిపల్, జాతీయ రహదారులు, రోడ్లు భవనాల శాఖ,రవాణా, ట్రాఫిక్,ఆర్టీసీ తదితర శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ప్రమాదాలు అధికంగా జరిగే ప్రాంతాలను గుర్తించి,అక్కడ అవసరమైన రహదారి భద్రతా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ట్రాఫిక్ సిగ్నల్స్ సక్రమంగా పనిచేసేలా ఎప్పటికప్పుడు తనిఖీలు నిర్వహించాలని, అవసరమైన చోట అదనపు భద్రతా ఏర్పాట్లు చేయాలని తెలిపారు. రోడ్డు ప్రమాదాల నివారణకు అవసరమైన పనులను గుర్తించి ప్రతిపాదనలు సమర్పిస్తే, నిబంధనల మేరకు అనుమతులు కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. రోడ్డు ప్రమాదాలకు అతివేగం, నిర్లక్ష్యంగా వాహనాలు నడపడం, మద్యం సేవించి డ్రైవింగ్ చేయడం ప్రధాన కారణాలని ఆమె తెలిపారు. వాహనదారులు అనుమతించిన వేగ పరిమితిలోనే వాహనాలు నడపాలని,రాంగ్ రూట్‌లో ప్రయాణించడం, ట్రాఫిక్ నిబంధనలను ఉల్లంఘించడం వంటి చర్యలకు దూరంగా ఉండాలని సూచించారు. రక్షణాత్మక డ్రైవింగ్ (డిఫెన్సివ్ డ్రైవింగ్) అలవర్చుకోవాలని,వాహనం నడిపేటప్పుడు పరిసరాలను గమనిస్తూ అప్రమత్తంగా ఉండటం ద్వారా ప్రమాదాలను నివారించవచ్చని తెలిపారు. రోడ్డు భద్రతపై పాఠశాల విద్యార్థులు, కళాశాల యువతకు విస్తృతంగా అవగాహన కల్పించాలని సంబంధిత అధికారులకు సూచించారు. పాదచారులు రోడ్డు దాటేటప్పుడు తగిన జాగ్రత్తలు పాటించాలని, వాహనదారులు పాదచారుల భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని పేర్కొన్నారు. ఈ ఏడాది జిల్లాలో జరిగిన రోడ్డు ప్రమాదాల వివరాలను అధికారులను అడిగి తెలుసుకొని, ప్రమాదాల నివారణకు అన్ని శాఖలు సమగ్ర కార్యాచరణతో ముందుకు సాగాలని సూచించారు. రంగారెడ్డి జిల్లాను రోడ్డు ప్రమాదాలు లేని జిల్లాగా తీర్చిదిద్దేందుకు అధికారులు సమిష్టిగా కృషి చేయాలని అన్నారు. ఈ సమావేశంలో రోడ్లు భవనాల శాఖ,రవాణా శాఖ,జాతీయ రహదారుల శాఖ,పోలీస్, ట్రాఫిక్,ఆర్టీసీ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

# మంచి రోడ్డును తవ్వి వదిలేశారు

**22 రోజులైనా ముందుకు కదలని సీసీ రోడ్డు పనులు..**

**బతుకమ్మ, దసరా పండుగల వేళ విజయపురి కాలనీ వాసులకు నరకయాతన..**

**డ్రైనేజీ పైపులైన్ ధ్వంసం..**

**మూడు వారాలుగా దుర్గంధం.. అయిన స్పందించని ఇంజనీరింగ్ అధికారులు..**

**కాంట్రాక్టర్ నిర్లక్ష్యమా.. అధికారుల అలసత్వమా.?**

**డిప్యూటీ, జోనల్ కమిషనర్లకు ప్రజల సమస్యలు పట్టవా.?**




**తార్నాక,(ప్రజావినికిడి):**
ప్రజలకు మెరుగైన రహదారులు కల్పించాల్సిన అధికారులు.. ఉన్న మంచి రోడ్డును తవ్వి వదిలేస్తే ప్రజల పరిస్థితి ఏమిటి.? పది రోజుల్లో పూర్తికావాల్సిన సీసీ రోడ్డు పనులు 22 రోజులు గడుస్తున్నా ముందుకు కదలకపోవడం అధికారుల బాధ్యతారహిత్య పనితీరుకు నిదర్శనంగా నిలుస్తోంది. మెట్టుగూడ సర్కిల్ పరిధిలోని తార్నాక విజయపురి కాలనీలో రోడ్డు పనుల పేరుతో స్థానిక ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

**పనులు నత్తనడక.. ప్రజలకు కష్టాల వాత**

రోడ్డును తవ్విన కాంట్రాక్టర్ పనులను సకాలంలో పూర్తి చేయకపోవడంతో కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా బతుకమ్మ, దసరా పండుగల సమయంలో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడినట్లు స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పండుగల వేళ ఇళ్లకు బంధువులు, అతిథులు వచ్చే సమయంలో రహదారి దుస్థితి కారణంగా అవస్థలు పడాల్సి వచ్చిందని వాపోతున్నారు. రోడ్డును తవ్వినప్పుడు చూపిన హడావుడి.. పనులు పూర్తి చేయడంలో మాత్రం కనిపించడం లేదని మండిపడుతున్నారు.

**డ్రైనేజీ పైపులైన్ పగులు.. దుర్గంధంతో సతమతం**

రోడ్డు తవ్వకాల సమయంలో డ్రైనేజీ పైపులైన్ దెబ్బతినడంతో మూడు వారాలు గడిచిపోతున్న మురుగునీటి సమస్య, తీవ్రమైన దుర్గంధం నెలకొన్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. దుర్వాసనతో పరిసరాల్లో నివసించలేని పరిస్థితి ఏర్పడినా ఇంజనీరింగ్ అధికారులు, కాంట్రాక్టర్ పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పారిశుధ్య సమస్యను వెంటనే పరిష్కరించాల్సిన యంత్రాంగం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం ఏమిటని ప్రశ్నిస్తున్నారు.

**ప్రజల కష్టాలు పట్టించుకోరా.?**

పనుల్లో జాప్యంపై స్థానికులు ప్రశ్నిస్తున్నా అధికారులు స్పందించడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. డిప్యూటీ కమిషనర్, జోనల్ కమిషనర్ స్థాయి అధికారులు సైతం ప్రజల సమస్యపై దృష్టి సారించడం లేదని కాలనీవాసులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. క్షేత్రస్థాయిలో పనుల పురోగతిని పరిశీలించి, కాంట్రాక్టర్‌కు స్పష్టమైన గడువు విధించాల్సిన అధికారులు మౌనం వహించడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

**కాంట్రాక్టర్లకు కొమ్ముకాస్తున్నారా.?**

సీసీ రోడ్ల నిర్మాణంలో జాప్యం, నాణ్యతపై ప్రజల్లో అనేక సందేహాలు వ్యక్తమవుతున్నాయి. కాంట్రాక్టర్ల పనితీరును పర్యవేక్షించాల్సిన ఇంజనీరింగ్ విభాగం ఎందుకు ఉదాసీనంగా వ్యవహరిస్తోందన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. గతంలో విజయపురి కాలనీలో వేసిన సిసి రోడ్డు లు నాణ్యత లోపంతో పాటు తూతూ మంత్రంగా పనులు ముగించుకొని కాంట్రాక్టర్లు అధికారులకు లంచాల చూపుతున్నారన్న విమర్శలు జోరుగా ఉన్నాయి. అధికారులు, కాంట్రాక్టర్ల మధ్య ఏవైనా అంతర్గత అవగాహనలు ఉన్నాయా.? అందుకోసమే వర్క్ ఆర్డర్ కు విరుద్ధంగా పనులు చేశారన్న అనుమానాలను స్థానికులు వ్యక్తం చేస్తున్నారు. అయితే ఈ ఆరోపణలపై విజిలెన్స్ విచారణ జరిపి వాస్తవాలను వెల్లడించాల్సిన అవసరం ఉంది.

**ప్రజల సహనాన్ని పరీక్షిస్తున్నారా.?**

ప్రజాధనంతో చేపట్టే అభివృద్ధి పనులు ప్రజలకు ఉపశమనం కలిగించాలి కానీ శాపంగా మారకూడదు. రోడ్డు పనులను సకాలంలో పూర్తి చేయకపోవడం, డ్రైనేజీ సమస్యను పరిష్కరించకపోవడం అధికారుల బాధ్యతారాహిత్యానికి అద్దం పడుతోందని స్థానికులు విమర్శిస్తున్నారు. తార్నాక విజయపురి కాలనీలో రహదారి పనుల నాణ్యతపై తనిఖీలు నిర్వహించి, దెబ్బతిన్న డ్రైనేజీ పైపులైన్‌ను తక్షణమే మరమ్మతు చేయాలని కాలనీవాసులు డిమాండ్ చేస్తున్నారు. ఇప్పటికైనా మెట్టుగూడ సర్కిల్ ఇంజనీరింగ్ అధికారులు స్పందిస్తారా.? లేక ప్రజల ఇబ్బందులను ఇలాగే గాలికి వదిలేస్తారా.? అన్నది వేచి చూడాల్సిందే.

## జైపూరి కాలనీలో తాగునీటి సమస్య పరిష్కారానికి ఎమ్మెల్యే సుధీర్ రెడ్డికి వినతి



**నాగోల్,(ప్రజావినికిడి):** నాగోల్ డివిజన్ లోని జైపూరి కాలనీలో భూగర్భ జలాలు అడుగంటిపోవడంతో ప్రతి ఇంట్లో బోర్ల నుంచి నీరు రావడం లేదు. దీంతో కాలనీ ప్రజలు తీవ్ర తాగునీటి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ సమస్యను దృష్టిలో ఉంచుకుని, కాలనీ వెల్ఫేర్ ఆధ్వర్యంలో 2010 సంవత్సరంలో ఏర్పాటు చేసిన బోరును మరమ్మతు చేయించాలని ఎల్బీనగర్ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి దృష్టికి అనంతల రాజా రెడ్డి తీసుకెళ్లారు. ఈ సమస్యపై ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి తక్షణమే స్పందించి సంబంధిత అధికారులతో మాట్లాడి బోరును మరమ్మతు చేయించి,తిరిగి వినియోగంలోకి తీసుకువచ్చేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. తద్వారా కాలనీలోని ప్రతి ఇంటికీ నీటి సరఫరా అందేలా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జైపూరికాలనీ టీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు పగిడిమర్రి శంకర్, చేగూరి శ్రీనివాస్, కురుమ బండ వేణు తదితరులు పాల్గొన్నారు. కాలనీ ప్రజల నీటి సమస్య పరిష్కారానికి స్పందించిన ఎమ్మెల్యేకు నాయకులకు కాలనీ వాసులు కృతజ్ఞతలు తెలిపారు.

## సరూర్‌నగర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎంఎస్‌ఎఫ్ బాలికల కమిటీ ఏర్పాటు




**ఎల్బీనగర్,(ప్రజావినికిడి):**
పద్మశ్రీ మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు మాదిగ స్టూడెంట్స్ ఫెడరేషన్ (ఎంఎస్ఎఫ్) నూతన కమిటీల నిర్మాణంలో భాగంగా సరూర్‌నగర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎల్బీనగర్ నియోజకవర్గ ఎంఆర్పీఎస్ ఇన్‌చార్జి కొమ్ము రాజశేఖర్ మాదిగ ఆధ్వర్యంలో శుక్రవారం మాదిగ విద్యార్థుల చైతన్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాలలో ఎంఎస్ఎఫ్ బాలికల కమిటీని ఏర్పాటు చేసి, నూతన కమిటీ సభ్యులకు బాధ్యతలు అప్పగించి అనంతరం నియామక పత్రాలను అందజేశారు. విద్యార్థుల్లో చైతన్యం పెంపొందించడంతో పాటు, విద్యార్థినుల సమస్యల పరిష్కారం,వారి హక్కుల సాధన కోసం ఐక్యంగా కృషి చేయాలని నాయకులు సూచించారు. నూతన కమిటీలో భాగంగా ఎంఎస్ఎఫ్ బాలికల కమిటీ అధ్యక్షురాలిగా జి.తన్వి మాదిగ, అధికార ప్రతినిధులుగా బి.అంజలి మాదిగ,కె.రజిత మాదిగ, ఉపాధ్యక్షురాలిగా కె.హర్షిణి మాదిగ, కోశాధికారిగా బి. భాను ప్రియ మాదిగ,అధికార ప్రతినిధి-2గా బి. అంజలి మాదిగ, ఉపాధ్యక్షురాలు-2గా పి.కీర్తన మాదిగ,ప్రధాన కార్యదర్శిగా కె. కీర్తన మాదిగ, ప్రధాన కార్యదర్శి-2గా రూప మాదిగ, కార్యదర్శులుగా ఎమ్.భవ్య మాదిగ,బి. జ్యోతిక మాదిగ, సహాయ కార్యదర్శులుగా కె.రాణి మాదిగ, కె.రమ్య మాదిగ, బి.కీర్తి మాదిగ నియమితులయ్యారు. ఈ కార్యక్రమంలో ఎంఆర్పీఎస్ కొత్తపేట డివిజన్ అధ్యక్షుడు మంద శేఖర్ మాదిగ, ఎంఎస్పీ నాయకుడు మంద రాములు మాదిగతో పాటు కళాశాలకు చెందిన మాదిగ విద్యార్థులు పాల్గొన్నారు.

## సంగారెడ్డి ఫ్యాక్టరీలో విషాదం.. గ్యాస్ లీకై ఇద్దరి మృతి

**సంగారెడ్డి జిల్లా సరాకా పరిశ్రమలో గ్యాస్ లీక్**

**మృతులు సుదర్శన్, బాలాజీగా గుర్తింపు**

**యాజమాన్య నిర్లక్ష్యం వల్లే ప్రమాదం జరిగిందని ఆరోపణలు**

**ఘటనపై దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు**



**సంగారెడ్డిఅక్టోబర్ 23 (ప్రజావినికిడి):**
తెలంగాణలోని సంగారెడ్డి జిల్లాలో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. జిన్నారం మండలం గడ్డపోతారం పారిశ్రామికవాడలోని 'సరాకా' పరిశ్రమలో గ్యాస్ లీకై ఇద్దరు కార్మికులు ప్రాణాలు కోల్పోయారు. మృతులను సుదర్శన్, బాలాజీగా గుర్తించారు. గ్యాస్ లీకేజీ కారణంగా ఊపిరాడకపోవడంతోనే వారు మృతి చెందినట్లు ప్రాథమికంగా నిర్ధారించారు.
ఈ దుర్ఘటనతో పారిశ్రామికవాడలో విషాద ఛాయలు అలముకున్నాయి. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. ప్రమాదానికి గల కచ్చితమైన కారణాలపై దర్యాప్తు ప్రారంభించారు. పరిశ్రమలో భద్రతా ప్రమాణాలు పాటించారా? లేదా? అనే కోణంలో విచారణ జరుపుతున్నారు. ఫ్యాక్టరీ యాజమాన్యం నిర్లక్ష్యం, భద్రతా లోపాల కారణంగానే ఈ ప్రమాదం జరిగిందని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఈ ఘటనపై సమగ్ర విచారణ జరిపి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని మృతుల కుటుంబ సభ్యులు, కార్మిక సంఘాల నేతలు డిమాండ్ చేస్తున్నారు.

## బీజేపీ, బీఆర్ఎస్ మధ్య రహస్య ఒప్పందం.. టీపీసీసీ చీఫ్

**నిజామాబాద్ అక్టోబర్ 23(ప్రజావినికిడి):**
తెలంగాణలో భారతీయ జనతా పార్టీ (బీజేపీ), భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) ఒక్కటేనని, వచ్చే ఎన్నికల్లో ఆ రెండు పార్టీలు కలిసే పోటీ చేస్తాయని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ ఆరోపించారు. నిజామాబాద్ అర్బన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీజేపీ, బీఆర్ఎస్ పార్టీల మధ్య లోపాయికారి ఒప్పందం ఉందని మహేశ్ గౌడ్ విమర్శించారు. త్వరలో జరగనున్న రెండు పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానాలకు బీఆర్ఎస్ ఇప్పటివరకు అభ్యర్థులను ప్రకటించకపోవడమే ఇందుకు నిదర్శనమని ఆయన పేర్కొన్నారు. ముందుగా బీజేపీ తన అభ్యర్థులను ప్రకటించిన తర్వాత, బీఆర్ఎస్ కేవలం నామమాత్రంగా అభ్యర్థులను బరిలోకి దింపుతుందన్నారు. పార్లమెంట్‌లో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రతి బిల్లుకు బీఆర్ఎస్ మద్దతు తెలిపిందని, బీజేపీతో ఆ పార్టీకి ఉన్న సన్నిహిత సంబంధాలకు ఇదే నిదర్శనమని ఆయన దుయ్యబట్టారు. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో జరిగిన అవినీతిపై సీబీఐ విచారణ జరిపిస్తామని గతంలో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి చేసిన ప్రకటన ఏమైందని మహేశ్ కుమార్ గౌడ్ ఈ సందర్భంగా నిలదీశారు.

ప్రజా వినికిడి
మా అక్షరం-మీ ఆయుధం
తెలుగు దినపత్రిక



## పర్యావరణ నిబంధనలు అమలవుతున్నాయా..?

# షాద్‌నగర్‌లో కాలుష్య భూతం.!

**పరిశ్రమలు 200 దాటినా స్థానికులకు ఉపాధి ఏది.?**

**అధికారుల పర్యవేక్షణ ఏది..?**

**లాభాలు పరిశ్రమల యాజమాన్యాలకు..**

**కాలుష్యంతో ఇబ్బందులు ప్రజలకా..?**

**ఓ వైపు పరిశ్రమల విస్తరణ..**

**మరోవైపు పర్యావరణంపై ఆందోళనలు..**



**షాద్‌నగర్,(ప్రజావినికిడి):**
పారిశ్రామికంగా అభివృద్ధి చెందుతున్న షాద్‌నగర్ నియోజకవర్గంలో ఇప్పుడు ఇదే చర్చ. 200కి పైగా పరిశ్రమలు ఉన్నట్లు చెబుతున్నా..స్థానిక యువతకు ఎన్ని ఉద్యోగాలు లభిస్తున్నాయి? పరిశ్రమల నుంచి వెలువడే వ్యర్థాలు,పొగపై పర్యవేక్షణ ఎంతవరకు జరుగుతోంది? కాలుష్య నియంత్రణ నిబంధనలు కచ్చితంగాఅమలవుతున్నాయా? అన్న ప్రశ్నలు ప్రజల్లో వ్యక్తమవుతున్నాయి. పరిశ్రమల ఏర్పాటుతో అభివృద్ధి పరుగులు పెడుతున్నా..ఆ అభివృద్ధి ఫలాలు స్థానికులకు అందుతున్నాయా? పర్యావరణ పరిరక్షణకు తీసుకుంటున్న చర్యలేమిటి? అనే అంశాలపై సంబంధిత శాఖలు స్పష్టత ఇవ్వాల్సిన అవసరం ఉంది.

### పరిశ్రమలు పెరిగాయి.. ఉద్యోగాలెక్కడ?

పరిశ్రమలు ఏర్పాటైతే స్థానిక నిరుద్యోగులకు ఉపాధి దొరుకుతుందని, గ్రామాల ఆర్థిక పరిస్థితులు మెరుగుపడతాయని ప్రజలు ఆశించారు. కానీ పరిశ్రమల్లో స్థానిక యువతకు ఎంతమేర ఉద్యోగాలు కల్పిస్తున్నారు? ఎంతమందికి శాశ్వత ఉపాధి లభిస్తోంది? ఎంతమంది కాంట్రాక్టు పద్ధతిలో పనిచేస్తున్నారు? అనే వివరాలు బయటకు రావాల్సి ఉంది. పరిశ్రమల అభివృద్ధి పేరుతో స్థానిక ప్రాంతాల్లో పారిశ్రామిక కార్యకలాపాలు విస్తరిస్తున్నప్పుడు,ఆ ప్రాంత యువతకు అవకాశాలు కల్పించడంపైనా యాజమాన్యాలు దృష్టి సారించాలి. ఉద్యోగాల కల్పనపై పరిశ్రమల వారీగా గణాంకాలను వెల్లడిస్తే వాస్తవ పరిస్థితి ప్రజలకు తెలుస్తుంది.

### అధికారుల పర్యవేక్షణ ఎక్కడ?

పరిశ్రమలకు అనుమతులు ఇచ్చినంత మాత్రాన ప్రభుత్వ బాధ్యత ముగిసినట్లు కాదు. వాటి నిర్వహణలో పర్యావరణ ప్రమాణాలు పాటిస్తున్నారా లేదా అన్నది ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలి. తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి అధికారులు షాద్‌నగర్ పరిధిలో ఎన్ని పరిశ్రమలను తనిఖీ చేశారు? ఎన్ని ఉల్లంఘనలు గుర్తించారు? ఎన్ని నోటీసులు జారీ చేశారు? నిబంధనలు ఉల్లంఘించిన యూనిట్లపై ఎలాంటి చర్యలు తీసుకున్నారు? అనే వివరాలు వెల్లడించాలి. తప్పులు నిర్ధారణ అయితే చట్టప్రకారం చర్యలు తీసుకోవాలి.తనిఖీలు కేవలం కాగితాలకే పరిమితం కాకుండా ప్రజలకు కనిపించే ఫలితాలు ఇవ్వాలి.

### కాలుష్యంపై ఫిర్యాదులు.. తనిఖీలు చేస్తున్నారా?

పరిశ్రమల పరిసరాల్లో గాలి, నీటి నాణ్యతపై ప్రజలకు ఆందోళనలు ఉంటే వాటిని అధికారులు తేలిగ్గా తీసుకోకూడదు. పరిశ్రమల పొగ గొట్టాల నుంచి వెలువడే ఉద్గారాలు,వ్యర్థ జలాల శు ద్ధి, ప్రమాదకర వ్యర్థాల నిర్వహణపై నిరంతర తనిఖీలు అవసరం. కాలుష్య నియంత్రణ పరికరాలు సక్రమంగా పనిచేస్తున్నాయా? నిబంధనలకు విరుద్ధంగా వ్యర్థాలను బయటకు విడుదల చేస్తున్నారా? అన్న అంశాలను క్షేత్రస్థాయిలో పరిశీలించాలి. ప్రజలు చేస్తున్న ఆరోపణలు నిజమో కాదో శాస్త్రీయ పరీక్షలతో నిర్ధారించి వాస్తవాలను వెల్లడించాలి.

### పరిశ్రమలకు లాభాలు.. ప్రజలకు నష్టాలా?

పరిశ్రమల వల్ల ఆర్థికాభివృద్ధి జరగడం అవసరమే. అయితే ఆ అభివృద్ధి ప్రజల ఆరోగ్యానికి ముప్పుగా మారకూడదు. పరిశ్రమల యాజమాన్యాలు స్థానిక యువతకు ఉద్యోగావకాశాలు కల్పించడంతో పాటు కార్మికుల భద్రతకు ప్రాధాన్యం ఇవ్వాలి. పరిసర గ్రామాల్లో తాగునీరు,పారిశుధ్యం,వైద్య సేవలు, పర్యావరణ పరిరక్షణ వంటి అంశాలపై కూడా బాధ్యతాయుతంగా వ్యవహరించాలి.సంబంధిత శాఖలు కార్మికుల పని పరిస్థితులు,రక్షణ పరికరాలు, భద్రతా ప్రమాణాలను పరిశీలించాలి.

### ప్రజల ఆరోగ్యమే ముఖ్యం

షాద్‌నగర్ పారిశ్రామిక అభివృద్ధికి ఎవరూ వ్యతిరేకం కాదు. కానీ పరిశ్రమల వృద్ధి పేరుతో పర్యావరణ పరిరక్షణను విస్మరించడానికి వీల్లేదు. స్థానికులకు ఉపాధి కల్పించాలి.. కాలుష్యాన్ని నియంత్రించాలి.. నిబంధనలు ఉల్లంఘించే వారిపై చర్యలు తీసుకోవాలి. ప్రజల ఫిర్యాదులపై అధికారులు స్పందించి వాస్తవాలను వెల్లడించాలి.పరిశ్రమల సంఖ్య పెరుగుతున్న కొద్దీ పర్యవేక్షణ కూడా బలోపేతం కావాలి.అభివృద్ధి పేరుతో ప్రజల ఆరోగ్యాన్ని పణంగా పెట్టకూడదు.పరిశ్రమల ప్రగతితో పాటు స్థానికుల బతుకులు బాగుపడినప్పుడే షాద్‌నగర్ అభివృద్ధికి అసలైన అర్థం చేకూరుతుందని స్థానికులు అభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారు.

# పసి ప్రాణాలతో చెలగాటం..



**దాదాపు పది రోజులుగా వ్యాక్సిన్ల ఇవ్వక చిన్నారుల ఆరోగ్యంపై నీలినీడలు..**

**నేషనల్ హెల్త్ మిషన్ ఉద్యోగుల ధర్నాతో స్తంభించిన వైద్య సేవలు..**

**గూగుల్‌లో, ప్రభుత్వ వెబ్‌సైట్లలో తప్పులతడకగా అధికారుల ఫోన్ నంబర్లు..**

**వైద్య ఆరోగ్య శాఖకు మంత్రి ఉన్నా.. క్షేత్రస్థాయిలో పాలన సున్నా..**

**హైదరాబాద్,(ప్రజావినికిడి):**
పసిపిల్లల ఆరోగ్యంతో చెలగాటమాడుతున్నారా.? చిన్నారులకు సకాలంలో అందాల్సిన టీకాల విషయంలో ఇంత నిర్లక్ష్యమా.? దాదాపు పది రోజులుగా వ్యాక్సిన్లు అందుబాటులో లేకపోవడంతో తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారనే ఆరోపణలు వికారాబాద్ జిల్లాలో వైద్యశాఖ పనితీరుపై తీవ్ర ప్రశ్నలు లేవనెత్తుతున్నాయి.ఒకవైపు నేషనల్ హెల్త్ మిషన్ ఉద్యోగుల ధర్నాతో వైద్య సేవలకు అంతరాయం ఏర్పడిందనే విమర్శలు వినిపిస్తుండగా, మరోవైపు చిన్నారులకు నిర్ణీత షెడ్యూల్ ప్రకారం టీకాలు అందకపోవడం ఆందోళన కలిగిస్తోంది. ఆరోగ్యశాఖ మంత్రి, కమిషనర్ ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసి ప్రజారోగ్యాన్ని కాపాడాల్సిన శాఖలోనే ఇలాంటి దుస్థితి నెలకొంటే సామాన్యులు ఎవరిని ఆశ్రయించాలి.?

### వ్యాక్సిన్లు ఎక్కడ.? బాధ్యత ఎవరిది.?

చిన్నారులకు వయస్సు, టీకా షెడ్యూల్ ప్రకారం వ్యాక్సిన్లు అందించడం ప్రజారోగ్య వ్యవస్థలో అత్యంత కీలకమైన బాధ్యత..టీకాలు అందుబాటులో లేకపోవడం లేదా సేవలకు అంతరాయం ఏర్పడటంతో తల్లిదండ్రులు ఆసుపత్రుల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి ఏర్పడడానికి బాధ్యులెవరు.? దాదాపు పది రోజులుగా వ్యాక్సిన్ల లేకపోవడంతో ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయలేదన్న ఆరోపణలపై ఆరోగ్యశాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ, జిల్లా వైద్యశాఖ అధికారులు వెంటనే స్పందించాల్సిన అవసరం ఉంది. సిబ్బందితో సమస్య ఉంటే కారణాలేమిటి.? ఇతర సిబ్బందిని ఎందుకు సమకూర్చలేకపోయారు.? ప్రత్యామ్నాయ ఏర్పాట్లు ఎందుకు చేయలేదు.? ఈ ప్రశ్నలకు ఆరోగ్యశాఖ కమిషనర్ సమాధానాలు చెప్పాలని ప్రతిపక్ష నాయకులు డిమాండ్ చేస్తున్నారు.
టీకాల షెడ్యూల్‌పై తల్లిదండ్రులకు స్పష్టమైన సమాచారం ఇవ్వాలి.టీకా అందుబాటులో లేకపోతే తదుపరి మోతాదు ఎప్పుడు వేయించుకోవాలి, ఎక్కడ అందుబాటులో ఉంది అనే వివరాలను వైద్య సిబ్బంది తెలియజేయాలి. కానీ అలాంటి కనీస సమాచారం లేకపోవడంతో తల్లిదండ్రులు ఆందోళన నెలకొన్నది. ఆలస్యమైన టీకాను ఎప్పుడు వేయించుకోవాలో వైద్యుల సలహా తీసుకోవాలి. చిన్నారుల ఆరోగ్యానికి సంబంధించిన అంశంలో కొంచెం కూడా నిర్లక్ష్యానికి తావుండకూడదుకానీ వికారాబాద్ జిల్లాలో తీవ్ర నిర్లక్ష్యంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

### ఉద్యోగుల ధర్నా.. ప్రజలకు తప్పని తిప్పలు..

నేషనల్ హెల్త్ మిషన్ ఉద్యోగుల ధర్నా కారణంగా వైద్య సేవలు స్తంభించాయన్న విమర్శలు పరిస్థితి తీవ్రతను తెలియజేస్తున్నాయి.ఉద్యోగుల సమస్యలు పరిష్కరించడం ప్రభుత్వ బాధ్యతే.అదే సమయంలో అత్యవసర వైద్య సేవలు, చిన్నారుల టీకాలు, గర్భిణులకు అందాల్సిన సేవలు నిలిచిపోకుండా చూడాల్సిన బాధ్యత కూడా ఉన్నత అధికారులదే. ఉద్యోగుల సమస్యలకు పరిష్కారం




చూపడంలో జాప్యం జరిగితే దాని ప్రభావం చివరకు సామాన్య ప్రజలపై పడుతుంది. విధులు,సేవలు, బాధ్యతల మధ్య సమన్వయం సాధించడంలో వైద్యశాఖ యంత్రాంగం విఫలమైందా అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

### గూగుల్‌లో తప్పు నంబర్లు.. ప్రభుత్వ వెబ్‌సైట్లలోనూ గందరగోళమేనా.?

వైద్య ఆరోగ్యశాఖ అధికారులను సంప్రదించేందుకు ప్రయత్నించే ప్రజలకు గూగుల్లో సరైన వివరాలు,ఫోన్ నంబర్లు అందుబాటులో లేకపోవడం మరో సమస్యగా మారిందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఐటీ రంగంలో దూసుకుపోతున్నాము అని చెప్పే ప్రభుత్వం ప్రభుత్వ శాఖలకు సంబంధించిన కనీస వివరాలు అధికారుల ఫోన్ నెంబర్లను గూగుల్లో ఏర్పాటు చేయకపోవడం సిగ్గుచేటని ప్రతిపక్ష నాయకులు ఆరోపిస్తున్నారు. గూగుల్‌లో కనిపించే కొన్ని సంప్రదింపు వివరాలు, ప్రభుత్వ వెబ్‌సైట్లలో ప్రచురించిన అధికారుల ఫోన్ నంబర్లు తప్పుగా ఉన్నాయని ప్రజలు చెబుతున్నారు. కొన్ని నెంబర్లు అధికారులు అసలు ఫోనే ఎత్తరని మరి అలాంటప్పుడు ప్రభుత్వ అధికారుల ఫోన్ నెంబర్లు ఎందుకు వెబ్సైట్లో పెడుతున్నారు కమిషనర్లకే తెలియాలి. ఫలితంగా ఫిర్యాదు చేయాలన్నా, వ్యాక్సిన్ల లభ్యత తెలుసుకోవాలన్నా, వైద్య సేవలపై సమాచారం పొందాలన్నా ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.
ప్రభుత్వ వెబ్‌సైట్లలో అధికారుల వివరాలు ప్రచురించడం మాత్రమే సరిపోదు.ఆ నంబర్లు పనిచేస్తున్నాయా.? సంబంధిత అధికారి అందుబాటులో ఉన్నారా.? బదిలీలు జరిగినప్పుడు వివరాలను అప్‌డేట్ చేస్తున్నారా.? ఉన్న అధికారులు ఫోన్ ఎందుకు ఎత్తడం లేదు.? ప్రజల ఫోన్లను అధికారులు ఎందుకు ఎత్తరు.? అనే అంశాలపై కమిషనర్,చీఫ్ సెక్రటరీల నిరంతర పర్యవేక్షణ ఉండాలి.

కానీ అలాంటి పరిస్థితి తెలంగాణ రాష్ట్రంలో ఉన్న ఏ శాఖలో లేకపోవడం ప్రజల కర్మగా భావిస్తున్నారు. ప్రజలకు ఉపయోగపడని సంప్రదింపు వ్యవస్థ ఉన్నా, లేనట్టే కాదా.? డిజిటల్ పాలన పేరుతో వెబ్‌సైట్లు నిర్వహిస్తున్నప్పుడు వాటిలోని సమాచారం వాస్తవాలకు అనుగుణంగా ఉండాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే.

### మంత్రి ఉన్నా.. పాలన ఎక్కడ.?

ఆరోగ్యశాఖకు మంత్రి ఉన్నారు. ప్రిన్సిపల్ సెక్రెటరీ, కమిషనర్, ఉన్నతాధికారులున్నారు.ప్రతి జిల్లా స్థాయిలో యంత్రాంగం ఉంది. అయినా ప్రజలకు కనీస వైద్య సేవలు సక్రమంగా అందుతున్నాయా అన్న సమీక్ష ఎక్కడ ఉంది ప్రజల ఫిర్యాదులపై జవాబు దారి తనం ఒక్క అధికారికైనా ఉందా అన్న విమర్శలు వినిపిస్తున్నాయి. వ్యాక్సిన్ల సరఫరా, ఉద్యోగుల సమస్యలు, ప్రజలకు సమాచారం అందించే వ్యవస్థలో లోపాలు ఒకేసారి వెలుగులోకి వస్తే అది సాధారణ సమస్యగా కొట్టిపారేయలేం. శాఖలో సమన్వయం కొరవడిందా.? క్షేత్రస్థాయి పరిస్థితులను ఉన్నతాధికారులు పర్యవేక్షిస్తున్నారా.? ప్రజల ఇబ్బందులు ప్రభుత్వానికి చేరుతున్నాయా.? అన్నది తేలాల్సి ఉంది.

### తక్షణ చర్యలు తీసుకుంటారా.?

వికారాబాద్ జిల్లా వైద్యశాఖ అధికారులు ఎన్ హెచ్ ఎం ఉద్యోగుల ధర్నాతో ఏర్పడిన సమస్యలపై వ్యాక్సిన్ల నిల్వలు,సరఫరా పరిస్థితిపై స్పష్టమైన ప్రకటన చేయాలి. పెండింగ్‌లో ఉన్న టీకాల పంపిణీకి కార్యాచరణ ప్రకటించి, అవసరమైన చోట ప్రత్యామ్నాయ కేంద్రాలను ఏర్పాటు చేయాలి. నేషనల్ హెల్త్ మిషన్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరిస్తూనే ప్రజారోగ్య సేవలు నిరంతరాయంగా కొనసాగించేలా చర్యలు తీసుకోవాలి. గూగుల్, ప్రభుత్వ వెబ్‌సైట్లలో ఉన్న అధికారుల సంప్రదింపు వివరాలను పరిశీలించి సరిచేయాలి.
చిన్నారుల ఆరోగ్యం ప్రభుత్వానికి ప్రాధాన్యమా.? లేక అధికారుల నిర్లక్ష్యానికి బలికావాల్సిందేనా.? వికారాబాద్ జిల్లాలో నెలకొన్న పరిస్థితులపై జిల్లా కలెక్టర్, వైద్యశాఖ ఉన్నతాధికారులు స్పందించి వాస్తవాలను ప్రజల ముందుంచాలి. ప్రజారోగ్యం విషయంలో జాప్యానికి తావులేదు. పసిపిల్లల టీకాల విషయంలో ప్రతి రోజు విలువైనదే, బాధ్యత వహించాల్సిన ఉన్నత అధికారులు ఇకనైనా మేల్కొంటారా.?

# ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీకి 40 ఏళ్లు..

## రూబీ జూబ్లీ వేడుకలకు ఉపరాష్ట్రపతి, గవర్నర్, చంద్రబాబు

**దేశంలోనే తొలి ఆరోగ్య విశ్వవిద్యాలయంగా గుర్తింపు పొందిన ఎన్టీఆర్ వర్సిటీ**

**40 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా రూబీ జూబ్లీ వేడుకల నిర్వహణ**

**అక్టోబర్ 26న విజయవాడలో జరగనున్న ఉత్సవాలు**

**ముఖ్య అతిథులుగా భారత ఉపరాష్ట్రపతి, గవర్నర్, ముఖ్యమంత్రి హాజరు**




**అక్టోబర్ 23(ప్రజావినికిడి):**
దేశ వైద్య విద్యారంగంలో ఒక చారిత్రక అధ్యాయాన్ని లిఖించిన డాక్టర్ ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం 40 ఏళ్ల మైలురాయిని పురస్కరించుకుని రూబీ జూబ్లీ వేడుకలను అత్యంత వైభవంగా నిర్వహించేందుకు సిద్ధమైంది. ఈ ప్రతిష్ఠాత్మక ఉత్సవాలకు భారత ఉపరాష్ట్రపతి సి.పి. రాధాకృష్ణన్, రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్, ముఖ్యమంత్రి చంద్రబాబు ముఖ్య అతిథులుగా హాజరుకానున్నారు.
ఈ వివరాలను యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ డాక్టర్ పి. చంద్రశేఖర్ శుక్రవారం విజయవాడలో మీడియాకు వెల్లడించారు. దేశంలోనే మొట్టమొదటి ఆరోగ్య విశ్వవిద్యాలయంగా 1986 నవంబర్ 1న ఏర్పాటైన ఈ సంస్థ, 2026 నవంబర్ 1 నాటికి 40 వసంతాలు పూర్తి చేసుకోనుందని ఆయన తెలిపారు. ఈ చారిత్రక సందర్భాన్ని పురస్కరించుకుని, అక్టోబర్ 26వ తేదీ సోమవారం విజయవాడలోని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కళావేదికలో రూబీ జూబ్లీ వేడుకలను అంగరంగ వైభవంగా నిర్వహించనున్నట్లు వివరించారు.గత నాలుగు దశాబ్దాలుగా లక్షలాది మంది వైద్యులను, ఆరోగ్య నిపుణులను దేశానికి అందించిన ఘనత ఈ విశ్వవిద్యాలయానికి దక్కుతుందని వీసీ చంద్రశేఖర్ కొనియాడారు. ఈ చారిత్రక వేడుకలకు దేశంలోని ప్రముఖ వైద్యులు, పూర్వ విద్యార్థులు, ఇతర ప్రముఖులు హాజరుకానున్నారని, అందుకు తగ్గట్లుగా ఏర్పాట్లు చేస్తున్నామని ఆయన పేర్కొన్నారు.

# కిమ్ జాంగ్ ఉన్ బతికే ఉన్నాడు..

## వదంతులపై స్పష్టతనిచ్చిన ఎన్ఐఎస్

**న్యూఢిల్లీ, అక్టోబర్ 23(ప్రజావినికిడి):**
ఉత్తర కొరియా అధినేత కిమ్ జాంగ్ ఉన్ ఆరోగ్యంపై గత కొద్ది రోజులుగా సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారంలో వాస్తవం లేదని దక్షిణ కొరియా స్పష్టం చేసింది. కిమ్ తీవ్ర అనారోగ్యంతో కోమాలోకి వెళ్లి మరణించారంటూ వ్యాపించిన వార్తలన్నీ అవాస్తవాలని దక్షిణ కొరియా జాతీయ గూఢచార సంస్థ (ఎన్ఐఎస్) తేల్చి చెప్పింది. ఈ మేరకు పార్లమెంటరీ ఇంటెలిజెన్స్ కమిటీతో జరిగిన రహస్య సమావేశంలో ఎన్ఐఎస్ అధికారులు ఈ విషయాన్ని వెల్లడించినట్లు సమావేశంలో పాల్గొన్న సభ్యులు తెలిపారు.
కిమ్ జాంగ్ ఉన్ తీవ్రమైన బ్రెయిన్ హెమరేజ్‌కు గురయ్యారని, కోమాలోకి వెళ్లారని, చివరకు మరణించారంటూ విదేశీ సోషల్ మీడియాలో పుకార్లు వేగంగా వ్యాపించాయి. కొన్ని అంతర్జాతీయ మీడియా సంస్థలు కూడా ఈ వార్తలను ప్రసారం చేశాయి. అయితే, ఈ ప్రచారానికి ఎలాంటి ఆధారాలు లేవని యోన్‌హాప్ న్యూస్ ఏజెన్సీ తన కథనంలో పేర్కొంది. ఈ వదంతులపై ఉత్తర కొరియా ప్రభుత్వ మీడియా



నేరుగా స్పందించనప్పటికీ, వాటికి చెక్ పెడుతూ కిమ్‌కు సంబంధించిన ఫోటోలను విడుదల చేసింది. ప్యాంగ్యాంగ్‌లో జరిగిన వస్త్ర, పాదరక్షల ప్రదర్శనలో కిమ్ తన కుమార్తె జు ఏతో కలిసి పాల్గొన్నారని, ఆ ఫోటోలను మంగళవారం ప్రచురించింది.
గత నెలలో కూడా ఎన్ఐఎస్ కిమ్ ఆరోగ్యంపై నివేదిక ఇచ్చింది. కిమ్ 140 కిలోలకు పైగా బరువుతో తీవ్రమైన ఊబకాయంతో బాధపడుతున్నారని, దీనివల్ల గుండె సంబంధిత వ్యాధుల ప్రమాదం ఎక్కువగా ఉందని, అయితే ప్రస్తుతం ఆయనకు గుర్తించదగిన ఆరోగ్య సమస్యలేవీ లేవని తెలిపింది. ఆయన చురుగ్గా కదులుతున్నారని, ఓ నౌకను తనిఖీ చేసేటప్పుడు మెట్లు కూడా వేగంగా ఎక్కారని గుర్తు చేసింది. ఆయన ఆరోగ్యాన్ని ప్రత్యేక వైద్య బృందం నిరంతరం పర్యవేక్షిస్తోందని వివరించింది.
ఇదే సమావేశంలో కిమ్ సోదరి, వర్కర్స్ పార్టీ సీనియర్ అధికారి కిమ్ యో జోంగ్ కార్యకలాపాలపై కూడా ఎన్ఐఎస్ నివేదిక ఇచ్చింది. దక్షిణ కొరియా సరిహద్దు వెంబడి జరుగుతున్న సైనిక నిర్మాణాలను ఆమె రక్షణ శాఖ సలహాదారు పాక్ జోంగ్ చోన్‌తో కలిసి పరిశీలించినట్లు తెలిపింది. ఇరు దేశాల మధ్య సంబంధాలు "రెండు శత్రు దేశాల" వంటివని కిమ్ ప్రకటించిన నేపథ్యంలో, ఏప్రిల్ 2024 నుంచి ఉత్తర కొరియా తమ సరిహద్దులను బలోపేతం చేసుకుంటోంది. ఈ క్రమంలో, దక్షిణ కొరియాపై మళ్లీ ప్రచార లౌడ్‌స్పీకర్లను పునఃప్రారంభిస్తామని, "భయంకరమైన, బాధాకరమైన పరిస్థితి"ని ఎదుర్కోవాల్సి వస్తుందని కిమ్ సోదరి యో జోంగ్ హెచ్చరించినట్లు ఎన్ఐఎస్ పేర్కొంది.

# కార్లలో ఆటోమేటిక్ బ్రేకింగ్ తప్పనిసరి..

## 2032 అక్టోబర్ నుంచి అమలుకు ప్రతిపాదనలు

**2028 నుంచి దశలవారీగా నిబంధనల అమలు**

**2030 నుంచి కొత్త కార్లలో ఏఈబీఎస్ తప్పనిసరి**

**2032 అక్టోబర్ నుంచి అన్ని ఎం1 కార్లకు వర్తింపు**

**రవాణా కార్లలో లేన్ కీపింగ్, డ్రైవర్ అప్రమత్తత వ్యవస్థలు**

**న్యూఢిల్లీ, అక్టోబర్ 23(ప్రజావినికిడి):**
రోడ్డు ప్రమాదాలను తగ్గించే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం కీలక ప్రతిపాదనను తెరపైకి తెచ్చింది. కార్లలో 'అడ్వాన్స్‌డ్ డ్రైవర్ అసిస్టెన్స్ సిస్టమ్' (ఏడీఏఎస్)లో భాగమైన 'ఆటోమేటిక్ ఎమర్జెన్సీ బ్రేకింగ్ సిస్టమ్' (ఏఈబీఎస్)ను తప్పనిసరి చేయాలని భావిస్తోంది. 2032 అక్టోబర్ 1 నుంచి ఎం1 కేటగిరీకి చెందిన అన్ని కార్లలో ఈ వ్యవస్థ ఉండేలా నిబంధనలు తీసుకురావాలని రోడ్డు రవాణా, రహదారుల మంత్రిత్వ శాఖ ప్రతిపాదించింది. దీనికి సంబంధించి కేంద్ర మోటారు వాహనాల నిబంధనలు-1989కు సవరణలతో ముసాయిదా నోటిఫికేషన్ విడుదల చేసింది. దీనిపై ప్రజలు తమ అభిప్రాయాలు, అభ్యంతరాలను 30 రోజుల్లోగా తెలియజేయవచ్చు.

### ఏఈబీఎస్ ఎలా పనిచేస్తుంది?

డ్రైవర్ ముందున్న ప్రమాదాన్ని గుర్తించి సకాలంలో బ్రేకులు వేయకపోతే ఏఈబీఎస్ వ్యవస్థ ఆటోమేటిక్‌గా బ్రేకులు వేస్తుంది. తద్వారా ప్రమాదాన్ని నివారించడం లేదా ఢీకొన్నప్పుడు జరిగే నష్ట తీవ్రతను తగ్గించడం దీని ఉద్దేశం.
ముసాయిదా ప్రకారం.. 2028 అక్టోబర్ 1 నుంచి ఏఈబీఎస్‌తో వచ్చే ఎం1 కేటగిరీ కార్లు, ఎన్1 కేటగిరీ తేలికపాటి సరుకు రవాణా వాహనాలు ఏఐఎస్-185 ప్రమాణాలకు అనుగుణంగా ఉండాలి. 2030 అక్టోబర్ 1 నుంచి కొత్తగా తయారయ్యే ఎం1 కార్లలో



ఈ వ్యవస్థ తప్పనిసరి కానుంది.
2032 అక్టోబర్ 1 నుంచి, ఇప్పటికే ఉత్పత్తిలో ఉన్న మోడళ్లతో సహా అన్ని ఎం1 కార్లకు ఈ నిబంధన వర్తించనుంది. ఎం1 కేటగిరీ కింద డ్రైవర్‌తో కలిపి గరిష్ఠంగా 8 మంది ప్రయాణికులు కూర్చునే సీట్లు ఉన్న వాహనాలు వస్తాయి. హ్యాచ్‌బ్యాక్ కార్లు, సెడాన్లు, ఎస్‌యూవీలు, ఎంయూవీలు వంటి సాధారణ ప్యాసింజర్ కార్లు ఈ కేటగిరీలో ఉంటాయి.

### స్టీరింగ్, లేన్ కీపింగ్ వ్యవస్థలకూ నిబంధనలు

2027 అక్టోబర్ 1 నుంచి మోటారు వాహనాల్లో స్టీరింగ్ వ్యవస్థకు సంబంధించిన ప్రమాణాలను ఏఐఎస్-193 ప్రకారం అమలు చేయాలని ప్రతిపాదించారు. అయితే స్టీరింగ్ వీల్ లేని మోటార్‌సైకిళ్లు, దివ్యాంగుల కోసం రూపొందించిన వాహనాలు, మూడు చక్రాల వాహనాలకు మినహాయింపు ఇవ్వనున్నారు. ఆటోమేటిక్ కమాండ్ స్టీరింగ్ ఫంక్షనాలిటీస్ (ఏసీఎస్ఎఫ్) ఉన్న ఎం1 కార్లు కూడా సంబంధిత ప్రమాణాలను పాటించాలి. ఎమర్జెన్సీ లేన్ కీపింగ్ సిస్టమ్ (ఈఎల్‌కేఎస్) ఉన్న వాహనాలకు ఏఐఎస్-191 (పార్ట్ 1) ప్రమాణాలు వర్తిస్తాయి. 2029 అక్టోబర్ 1 నుంచి రవాణా వాహనాలుగా నమోదయ్యే ఎం1 కార్లలో ఏసీఎస్ఎఫ్, ఈఎల్‌కేఎస్ వ్యవస్థలను తప్పనిసరి చేయాలని ప్రతిపాదించారు. డ్రైవర్ నిద్రమత్తు, అప్రమత్తతను గుర్తించి హెచ్చరించే వ్యవస్థలనూ వీటిలో ప్రవేశపెట్టే ప్రతిపాదన ఉంది.

### ట్రక్కులు, బస్సులకూ భద్రతా ఫీచర్లు

వాణిజ్య వాహనాల భద్రతను పెంచేందుకు కూడా కేంద్రం పలు మార్పులను ప్రతిపాదించింది. 2027 జనవరి నుంచి కొత్త ట్రక్కులు, బస్సుల మోడళ్లలో ఆటోమేటిక్ ఎమర్జెన్సీ బ్రేకింగ్‌తో పాటు బ్లైండ్ స్పాట్ సమాచారం, వాహనం కదలడం ప్రారంభించినప్పుడు హెచ్చరికలు, డ్రైవర్ నిద్రమత్తును గుర్తించే వ్యవస్థ, లేన్ నుంచి పక్కకు వెళ్లినప్పుడు హెచ్చరించే సాంకేతికతను తప్పనిసరి చేయనున్నారు.
2027 అక్టోబర్ 1 నుంచి ట్రక్కులకు సవరించిన బ్రేకింగ్ ప్రమాణాలతో పాటు ఎలక్ట్రానిక్ స్టెబిలిటీ కంట్రోల్ (ఈఎస్‌సీ)ను అమలు చేయాలని ప్రతిపాదించారు. అలాగే 2028 అక్టోబర్ 1 నుంచి కొత్తగా తయారయ్యే అన్ని వాహనాల్లో వెహికల్-టు-వెహికల్ (వీ2వీ) కమ్యూనికేషన్ వ్యవస్థను తప్పనిసరి చేయాలని ముసాయిదాలో పేర్కొన్నారు. ఈ సాంకేతికత ద్వారా వాహనాలు తమ వేగం, స్థానం, ప్రయాణ దిశ వంటి సమాచారాన్ని పరస్పరం పంచుకోగలవు.
ప్రజల నుంచి వచ్చే అభిప్రాయాలు, అభ్యంతరాలను పరిశీలించిన తర్వాత కేంద్రం తుది నిబంధనలను ఖరారు చేయనుంది.

# ఎస్‌బీఐ కస్టమర్ల డబ్బుకు ధోకా లేదు..

## డేటా లీక్‌పై బ్యాంకు స్పష్టత

**న్యూఢిల్లీ, అక్టోబర్ 23(ప్రజావినికిడి):**




ఇటీవల జరిగిన సైబర్ ఘటనలో 3,897 మంది ఖాతాదారుల వివరాలు డార్క్ వెబ్‌లో బయటపడినప్పటికీ, వారి ఖాతాల్లోని నగదు, నిల్వలు సురక్షితంగానే ఉన్నాయని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) స్పష్టం చేసింది. ప్రభావితమైన ఖాతాదారులకు ఈమెయిల్ లేదా వాట్సాప్ ద్వారా వ్యక్తిగతంగా సమాచారం అందించినట్లు శుక్రవారం వెల్లడించింది.
ఈ మేరకు ఎక్స్ వేదికగా బ్యాంకు ప్రకటన విడుదల చేసింది. ఖాతాదారుల నగదు భద్రంగా ఉందని మరోసారి స్పష్టం చేసింది. డిజిటల్ బ్యాంకింగ్ సేవలను ఉపయోగించేటప్పుడు జాగ్రత్తలు పాటించాలని సూచించింది. వన్ టైమ్ పాస్‌వర్డ్ (ఓటీపీ), పిన్, పాస్‌వర్డ్‌లను ఎవరికీ చెప్పవద్దని హెచ్చరించింది. అనుమానాస్పద ఫోన్ కాల్స్, సందేశాలు, ఈమెయిళ్ల పట్ల అప్రమత్తంగా ఉండాలని కోరింది.ఈ వారంలోనే ఎస్‌బీఐ తన ఖాతాదారుల సమాచారానికి సంబంధించిన డేటా లీక్ ఘటనను ధ్రువీకరించింది. డార్క్ వెబ్‌లో అందుబాటులో ఉన్న సుమారు 3.75 లక్షల రికార్డులను ప్రాథమికంగా పరిశీలించగా, వాటిలో 3,897 మంది ఖాతాదారులకు సంబంధించిన వ్యక్తిగత గుర్తింపు వివరాలు ఉన్నట్లు గుర్తించామని స్టాక్ ఎక్స్ఛేంజీకి ఇచ్చిన సమాచారం లో పేర్కొంది.
థ్రెట్ ఇంటెలిజెన్స్ సర్వీస్ ప్రొవైడర్, డిఫెన్స్ సైబర్ ఏజెన్సీ, భారత కంప్యూటర్ ఎమర్జెన్సీ రెస్పాన్స్ టీమ్ (సెర్ట్-ఇన్) నుంచి ఖాతాదారుల సమాచారం బయటపడి ఉండొచ్చన్న హెచ్చరికలు అందినట్లు బ్యాంకు తెలిపింది.లీకైనట్లు గుర్తించిన సమాచారంలో ఖాతాదారుల నమోదిత మొబైల్ నంబర్లు, పుట్టిన తేదీలు, పేర్లు, లింగం, ఈమెయిల్ చిరునామాలు, నివాస చిరునామాలు ఉన్నట్లు పేర్కొంది. వీటితో పాటు బ్యాంకు శాఖ వివరాలు, సీఐఎఫ్ గుర్తింపు నంబర్లు, లీడ్ ఐడీలు, రుణాలు లేదా ఇతర లీడ్ రికార్డులకు సంబంధించిన మెటాడేటా, ఇతర ఫైళ్ల వివరాలు కూడా ఉన్నట్లు తెలిపింది.
ఈ ఘటనపై వెంటనే సైబర్ భద్రతా చర్యలు ప్రారంభించినట్లు ఎస్‌బీఐ వెల్లడించింది. సెర్ట్-ఇన్ గుర్తింపు పొందిన స్వతంత్ర సైబర్ భద్రతా సంస్థను నియమించి సమగ్ర పరిశీలన చేపట్టినట్లు తెలిపింది. బయటపడిన సమాచారం నిజమైనదేనా, దాని పరిధి ఎంత? అది ఎక్కడి నుంచి బయటకు వచ్చింది? దీనివల్ల ఎలాంటి ప్రమాదాలు ఎదురయ్యే అవకాశం ఉందనే అంశాలపై దర్యాప్తు కొనసాగుతోందని పేర్కొంది.

# జియో ప్లాట్‌ఫామ్స్ ఐపీఓ సంచలనం..

## కోటి దరఖాస్తులతో ప్రపంచ రికార్డ్!

**న్యూఢిల్లీ, అక్టోబర్ 23(ప్రజావినికిడి):**




భారత కార్పొరేట్ చరిత్రలోనే అతిపెద్ద పబ్లిక్ ఇష్యూగా నిలిచిన జియో ప్లాట్‌ఫామ్స్ ఐపీఓ, సరికొత్త ప్రపంచ రికార్డును నెలకొల్పింది. కోటికి పైగా దరఖాస్తులు అందుకున్న ప్రపంచంలోనే తొలి ఐపీఓగా ఇది చరిత్ర సృష్టించింది. శుక్రవారం (అక్టోబర్ 23) బిడ్డింగ్ గడువు ముగిసే సమయానికి, అన్ని విభాగాల ఇన్వెస్టర్ల నుంచి అపూర్వ స్పందన లభించింది.దేశ చరిత్రలోనే భారీ ఐపీఓగా పేరొందిన ఈ రూ. 30,213 కోట్ల ఇష్యూ కోసం ఇన్వెస్టర్లు పోటెత్తారు. అక్టోబర్ 21న ప్రారంభమైన ఈ ఇష్యూ, కేవలం 100 నిమిషాల్లోనే పూర్తిస్థాయిలో సబ్‌స్క్రయిబ్ కావడం విశేషం. ముగింపు రోజు మధ్యాహ్నానికే దరఖాస్తుల సంఖ్య కోటి మార్కును దాటింది. గతంలో వారీ ఎనర్జీస్ పేరిట ఉన్న సుమారు 97 లక్షల దరఖాస్తుల రికార్డును జియో సునాయాసంగా అధిగమించింది. శుక్రవారం సాయంత్రానికి మొత్తం దరఖాస్తుల సంఖ్య కోటిని మించిపోయింది. అందుబాటులో ఉన్న షేర్ల కంటే ఆరు రెట్లకు పైగా డిమాండ్ నమోదైంది.ఈ పబ్లిక్ ఇష్యూ ప్రారంభానికి ముందే, యాంకర్ ఇన్వెస్టర్ల నుంచి కంపెనీ రూ. 8,110 కోట్లు సమీకరించింది. ఈ విభాగానికి ఏకంగా 30 రెట్లకు పైగా డిమాండ్ లభించింది. అంటే, దాదాపు రూ. 2.5 లక్షల కోట్ల విలువైన బిడ్లు దాఖలయ్యాయి. అబుదాబి ఇన్వెస్ట్‌మెంట్ అథారిటీ, బ్లాక్‌రాక్, ఫిడిలిటీ వంటి అంతర్జాతీయ ప్రఖ్యాతి గాంచిన సంస్థలు ఇందులో పెట్టుబడులు పెట్టాయి.పబ్లిక్ ఇష్యూలో క్వాలిఫైడ్ ఇన్‌స్టిట్యూషనల్ బయ్యర్స్ (క్యూఐబీ) కోటా 14 నుంచి 20 రెట్లు, నాన్-ఇన్‌స్టిట్యూషనల్ ఇన్వెస్టర్ల కోటా 9 నుంచి 11 రెట్లు, రిటైల్ విభాగం సుమారు 2 రెట్లు సబ్‌స్క్రయిబ్ అయ్యాయి. రిలయన్స్ ఇండస్ట్రీస్ ఉద్యోగులు, వాటాదారుల కోటాలు కోసం కేటాయించిన కోటాలు కూడా పూర్తిస్థాయిలో భర్తీ అయ్యాయి.రిలయన్స్ ఇండస్ట్రీస్ గ్రూప్‌కు చెందిన జియో ప్లాట్‌ఫామ్స్, ఆకాష్ అంబానీ సారథ్యంలో కొనసాగుతోంది. ఇప్పటికే 50 కోట్లకు పైగా మొబైల్ వినియోగదారులతో దేశంలోనే అతిపెద్ద టెలికాం ఆపరేటర్‌గా ఉన్న ఈ సంస్థలో గూగుల్, మెటా వంటి దిగ్గజ సంస్థలు భాగస్వాములుగా ఉన్నాయి. ఐపీఓ ద్వారా సమీకరించిన నిధులతో కంపెనీ తన కార్యకలాపాలను మరింత విస్తరించనుంది. షేర్ల కేటాయింపు ప్రక్రియను పూర్తి చేసి, అక్టోబర్ 28న బీఎస్ఈ, ఎన్ఎస్ఈలలో లిస్టింగ్ చేసేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి.

# డ్రైవింగ్ లైసెన్సుల్లో భారీ మార్పులు..

## భారతీయులు, విదేశీయులకు వేర్వేరు రంగులు!

**న్యూఢిల్లీ, అక్టోబర్ 23(ప్రజావినికిడి):**




దేశవ్యాప్తంగా డ్రైవింగ్ లైసెన్సుల జారీ వ్యవస్థలో సమూల మార్పులకు కేంద్ర ప్రభుత్వం సిద్ధమవుతోంది. ఇందులో భాగంగా భారత పౌరులు, విదేశీయులను సులభంగా గుర్తించేందుకు వీలుగా వేర్వేరు రంగుల్లో డ్రైవింగ్ లైసెన్సులను జారీ చేయాలని ప్రతిపాదించింది. ఈ మేరకు కేంద్ర రోడ్డు రవాణా, రహదారుల మంత్రిత్వ శాఖ.. కేంద్ర మోటారు వాహన నిబంధనల సవరణల కోసం ఒక ముసాయిదా నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. ఈ కొత్త విధానంలో భాగంగా లైసెన్సు కార్డుపై వాహనదారుడి జాతీయతను కూడా స్పష్టంగా ముద్రించనున్నారు.నకిలీ పత్రాల వినియోగాన్ని అరికట్టి, లైసెన్సింగ్ ప్రక్రియను మరింత కఠినతరం చేయడమే ఈ సంస్కరణల ముఖ్య ఉద్దేశం. ఇప్పటివరకు వయసు, చిరునామా ధ్రువీకరణ కోసం ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్ లేదా నోటరీ ముందు సమర్పించే అఫిడవిట్లను, జీవిత బీమా పాలసీలను ఇకపై అంగీకరించబోమని ముసాయిదాలో స్పష్టం చేశారు. వీటిని దుర్వినియోగం చేస్తున్నట్లు గుర్తించడంతో ఈ నిర్ణయం తీసుకున్నారు.ఇకపై ఆన్‌లైన్‌లో నిర్వహించే సేఫ్-డ్రైవింగ్ ట్యుటోరియల్ అసెస్‌మెంట్‌లో పాస్ మార్కును 60 శాతం నుంచి 75 శాతానికి పెంచాలని ప్రతిపాదించారు. ఈ ట్యుటోరియల్ కనీసం 30 నిమిషాల పాటు కొనసాగేలా నిబంధన విధించనున్నారు. అంతేకాకుండా, ప్రతి లైసెన్సుపై వాహనదారుడి బ్లడ్ గ్రూప్, మొబైల్ నంబర్, ఎమర్జెన్సీ కాంటాక్ట్ వివరాలను తప్పనిసరిగా ముద్రించనున్నారు. ఆన్‌లైన్‌లో ఆధార్ అథెంటికేషన్ ద్వారా చిరునామా, పేరు లేదా ఇతర వివరాలను మార్చుకునే వారికి సంబంధిత ఫీజుల నుంచి మినహాయింపు ఇవ్వనున్నారు.చిరునామా, వయసు, గుర్తింపు కోసం ఏయే పత్రాలు చెల్లుబాటు అవుతాయో కూడా ప్రభుత్వం స్పష్టంగా పేర్కొంది. ఆధార్ కార్డ్, ఓటర్ ఐడీ, ఈ-రేషన్ కార్డ్, ఇటీవలి కరెంట్ లేదా గ్యాస్ బిల్లులను చిరునామా రుజువుగా సమర్పించవచ్చు. లైసెన్సులో మార్పుల కోసం చేసుకున్న దరఖాస్తులను 15 రోజుల్లోగా, చిరునామా మార్పు దరఖాస్తులను 30 రోజుల్లోగా పరిష్కరించాలని గడువు విధించారు. ఒకవేళ 30 రోజులు దాటినా చిరునామా మార్పు దరఖాస్తు పెండింగ్‌లో ఉంటే, అది ఆటోమేటిక్‌గా ఆమోదం పొందినట్లుగా భావిస్తారు.ప్రస్తుతం ఈ ప్రతిపాదనలన్నీ ముసాయిదా దశలోనే ఉన్నాయి. నోటిఫికేషన్ విడుదలైన 30 రోజుల్లోగా ప్రజల నుంచి అభ్యంతరాలు, సూచనలను స్వీకరించిన తర్వాత తుది నిబంధనలను ఖరారు చేయనున్నట్లు మంత్రిత్వ శాఖ వెల్లడించింది.

# తొలి వన్డేలో భారత బౌలర్ల జోరు




## జింబాబ్వే 197 పరుగులకే ఆలౌట్.. శ్రీ చరణి నాలుగు వికెట్లతో మెరుపులు

**వడోదర:** ఇప్పటికే టీ20 సిరీస్‌ను క్లీన్‌స్వీప్ చేసిన భారత జట్టు, వన్డే సిరీస్‌పైనా ఆధిపత్యం సాధించాలనే లక్ష్యంతో బరిలోకి దిగింది. మూడు మ్యాచ్‌ల వన్డే సిరీస్‌లో భాగంగా జరిగిన తొలి పోరులో భారత బౌలర్లు అద్భుత ప్రదర్శనతో ఆకట్టుకున్నారు. సమష్టిగా రాణించిన బౌలింగ్ దళం జింబాబ్వే బ్యాటర్లను కట్టడి చేయడంతో ప్రత్యర్థి జట్టు 49.5 ఓవర్లలో 197 పరుగులకే ఆలౌట్ అయింది. దీంతో భారత్ ముందు 198 పరుగుల లక్ష్యం నిలిచింది. ముఖ్యంగా తెలుగు అమ్మాయి శ్రీ చరణి నాలుగు వికెట్లు పడగొట్టి జింబాబ్వే బ్యాటింగ్ పతనంలో కీలక పాత్ర పోషించింది. **శ్రీ చరణి సూపర్ బౌలింగ్** భారత బౌలర్లలో శ్రీ చరణి అద్భుతమైన బౌలింగ్‌తో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. కేవలం 23 పరుగులిచ్చి నాలుగు వికెట్లు పడగొట్టిన ఆమె ప్రత్యర్థి జట్టు పరుగుల వేగాన్ని నియంత్రించడమే కాకుండా కీలక బ్యాటర్లను పెవిలియన్‌కు పంపింది. జింబాబ్వే బ్యాటర్లు నిలదొక్కుకునే ప్రయత్నం చేసిన ప్రతిసారీ భారత బౌలర్లు ఒత్తిడి పెంచుతూ వికెట్లు సాధించారు. శ్రీ చరణి ప్రదర్శనకు తోడు మిగతా బౌలర్లు కూడా సమర్థంగా సహకరించడంతో జింబాబ్వే జట్టు భారీ స్కోరు సాధించలేకపోయింది. **క్రాంతి గౌడ్ సైతం కీలక పాత్ర** భారత బౌలింగ్‌లో క్రాంతి గౌడ్ కూడా తనదైన ముద్ర వేసింది. 42 పరుగులిచ్చి మూడు వికెట్లు పడగొట్టి ప్రత్యర్థి జట్టు బ్యాటింగ్ క్రమాన్ని దెబ్బతీసింది. మరోవైపు దీప్తి శర్మ రెండు వికెట్లు తీసి జింబాబ్వేపై ఒత్తిడి పెంచగా, షఫాలీ వర్మకు ఒక వికెట్ దక్కింది. ఈ విధంగా భారత బౌలర్లు సమష్టిగా రాణించి జింబాబ్వేను తక్కువ స్కోరుకే పరిమితం చేశారు. **బెలోవెడ్ బిజా అర్ధశతకం** టాస్ గెలిచి తొలుత బ్యాటింగ్ చేసిన జింబాబ్వే జట్టులో బెలోవెడ్ బిజా 62 పరుగులతో ఆకట్టుకుంది. ఆమె అర్ధశతకంతో జట్టుకు కొంత ఊరట లభించింది. మిచెల్లె మవుంగ 29 పరుగులు, మోడెస్టర్ ముపచిక్వా 25 పరుగులు, చిపో ముగేరి 21 పరుగులు చేసి తమ వంతు సహకారం అందించారు. అయితే మిగతా బ్యాటర్లు ఎక్కువసేపు క్రీజులో నిలవలేకపోవడంతో జింబాబ్వే ఇన్నింగ్స్ 49.5 ఓవర్లలో 197 పరుగుల వద్ద ముగిసింది. **భారత్ లక్ష్యం 198 పరుగులు** తొలి ఇన్నింగ్స్‌లో భారత బౌలర్లు ఆధిపత్యం ప్రదర్శించడంతో జింబాబ్వేను 197 పరుగులకే పరిమితం చేయగలిగారు. ఇప్పుడు 198 పరుగుల లక్ష్యాన్ని ఛేదించాల్సిన బాధ్యత భారత బ్యాటర్లపై ఉంది. టీ20 సిరీస్‌లో చూపిన జోరును వన్డేల్లోనూ కొనసాగించి తొలి మ్యాచ్‌లో విజయం సాధించాలని భారత జట్టు లక్ష్యంగా పెట్టుకుంది. బౌలర్లు అందించిన అవకాశాన్ని బ్యాటర్లు ఎలా సద్వినియోగం చేసుకుంటారన్నది కీలకంగా మారింది.

# అనూహ్యంగా భారత జట్టులోకి వైభవ్ సూర్యవంశీ!

### - అతి పిన్న వయసులోనే అంతర్జాతీయ క్రికెట్‌లో అరంగేట్రం.. యువ సంచలనంపై భారీ అంచనాలు



**న్యూఢిల్లీ:** భారత క్రికెట్‌లో యువ సంచలనం వైభవ్ సూర్యవంశీ పేరు మరోసారి మార్మోగుతోంది. తన అసాధారణ బ్యాటింగ్ ప్రతిభతో అతి తక్కువ కాలంలోనే ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న ఈ యువ ఆటగాడు జాతీయ జట్టులో చోటు సంపాదించి అందరి దృష్టిని ఆకర్షించాడు. చిన్న వయసులోనే అద్భుతమైన షాట్లతో బౌలర్లను ఇబ్బంది పెట్టగల సామర్థ్యం కలిగిన వైభవ్‌పై క్రికెట్ అభిమానులు భారీ అంచనాలు పెట్టుకున్నారు. అతడి ఆటతీరు, పరుగులు సాధించే వేగం, ఒత్తిడిలోనూ దూకుడుగా ఆడే విధానం భవిష్యత్తులో భారత క్రికెట్‌కు మంచి అవకాశాలను సూచిస్తున్నాయి. **చిన్న వయసులోనే సంచలన ప్రదర్శనలు** వైభవ్ సూర్యవంశీ అతి చిన్న వయసులోనే క్రికెట్ ప్రపంచం దృష్టిని ఆకర్షించాడు. యువ క్రికెట్ పోటీల్లో అద్భుతమైన ప్రదర్శనలు చేయడంతో పాటు, దేశవాళీ క్రికెట్‌లోనూ తన ప్రతిభను చాటుకున్నాడు. ముఖ్యంగా భారీ షాట్లు ఆడటంలో అతడికి ఉన్న నైపుణ్యం, వేగంగా పరుగులు సాధించే సామర్థ్యం అతడిని ఇతర యువ ఆటగాళ్ల నుంచి ప్రత్యేకంగా నిలబెట్టాయి. ప్రత్యర్థి జట్టు బౌలర్లపై ఒత్తిడి పెంచుతూ దూకుడుగా ఆడటం అతడి ప్రధాన బలంగా మారింది. **ఐపీఎల్‌లోనూ అదరగొట్టిన యువ ఆటగాడు** ఇండియన్ ప్రీమియర్ లీగ్‌లో వైభవ్ ప్రదర్శనలు అతడి ప్రతిభను మరింత వెలుగులోకి తీసుకొచ్చాయి. అనుభవజ్ఞులైన బౌలర్లను ఎదుర్కొంటూ ధైర్యంగా బ్యాటింగ్ చేయడం ద్వారా అభిమానులను ఆకట్టుకున్నాడు. తక్కువ బంతుల్లోనే ఎక్కువ పరుగులు సాధించగల సామర్థ్యం అతడికి ప్రత్యేక గుర్తింపును తెచ్చిపెట్టింది. ఐపీఎల్‌లో లభించిన అనుభవం అతడి ఆత్మవిశ్వాసాన్ని పెంచడంతో పాటు, ఉన్నత స్థాయి క్రికెట్‌కు సిద్ధమయ్యేందుకు దోహదపడింది. **భారత జట్టులో అవకాశంతో కొత్త అధ్యాయం** జాతీయ జట్టులో చోటు సంపాదించడం ప్రతి క్రికెటర్ కల. వైభవ్ సూర్యవంశీకి చిన్న వయసులోనే ఈ అవకాశం లభించడం అతడి ప్రతిభకు నిదర్శనంగా నిలుస్తోంది. అయితే అంతర్జాతీయ క్రికెట్‌లో నిలదొక్కుకోవాలంటే ప్రతిభతో పాటు నిలకడ, పరిస్థితులకు అనుగుణంగా ఆడే నైపుణ్యం, మానసిక దృఢత్వం కూడా అవసరం. జట్టు యాజమాన్యం అతడికి ఎప్పుడు, ఏ విధంగా అవకాశం కల్పిస్తుందన్నది ఆసక్తికరంగా మారింది. **అభిమానుల్లో భారీ అంచనాలు** వైభవ్ సూర్యవంశీ ఆటతీరుపై అభిమానులు ఆశలు పెట్టుకున్నారు. అతడు తన సహజమైన దూకుడును కొనసాగిస్తూ జట్టు అవసరాలకు అనుగుణంగా ఆడగలిగితే భారత క్రికెట్‌లో మరింత ఉన్నత స్థాయికి చేరుకునే అవకాశం ఉంది. అయితే యువ ఆటగాడిపై అతిగా అంచనాలు పెట్టకుండా, అనుభవం సంపాదించేందుకు తగిన సమయం ఇవ్వడం కూడా అంతే ముఖ్యం.

# భల్లెం విసురులో హనీకి స్వర్ణ పతకం

### - ప్రపంచ రికార్డు బద్దలు.. 60.49 మీటర్ల దూరం విసిరి అగ్రస్థానం కైవసం



**నాగోయా:** ఆసియా దివ్యాంగుల క్రీడల్లో భారత క్రీడాకారులు అద్భుత ప్రతిభ కనబరుస్తున్నారు. పురుషుల భల్లెం విసురు పోటీలో భారత క్రీడాకారుడు హనీ స్వర్ణ పతకాన్ని సాధించి దేశ కీర్తిని చాటాడు. చివరి ప్రయత్నంలో ఏకంగా 60.49 మీటర్ల దూరం భల్లెం విసిరి సరికొత్త ప్రపంచ రికార్డును నెలకొల్పాడు. ఈ అద్భుత ప్రదర్శనతో ప్రత్యర్థులను వెనక్కి నెట్టి అగ్రస్థానాన్ని కైవసం చేసుకున్నాడు. **చివరి ప్రయత్నంలో ప్రపంచ రికార్డు** పోటీ ఆరంభం నుంచే హనీ మెరుగైన ప్రదర్శనతో ఆకట్టుకున్నాడు. ప్రతి ప్రయత్నంలోనూ తన ప్రతిభను చాటుతూ ముందుకు సాగాడు. ఐదో ప్రయత్నంలో 59.72 మీటర్ల దూరం భల్లెం విసిరిన హనీ, చివరి ప్రయత్నంలో మరింతగా సత్తా చాటాడు. ఏకంగా 60.49 మీటర్ల దూరం విసిరి ప్రపంచ రికార్డును తిరగరాశాడు. ఈ ప్రదర్శనతో స్వర్ణ పతకాన్ని అందుకోవడంతో పాటు భారత క్రీడా ప్రతిష్ఠను అంతర్జాతీయ స్థాయిలో నిలబెట్టాడు. **కాంస్యం నుంచి స్వర్ణం వరకు** హనీ ఈ క్రీడా పోటీల్లో వరుసగా పతకాలు సాధిస్తూ సత్తా చాటుతున్నాడు. పురుషుల చక్రం విసురు పోటీలో 57.04 మీటర్ల దూరం విసిరి కాంస్య పతకాన్ని సాధించాడు. తాజాగా భల్లెం విసురులో ప్రపంచ రికార్డుతో స్వర్ణ పతకాన్ని గెలుచుకున్నాడు. రెండు విభాగాల్లోనూ తన ప్రతిభను చాటిన హనీ ప్రదర్శన క్రీడాభిమానులను ఆకట్టుకుంటోంది. **భారత క్రీడాకారుల పతకాల జోరు** ఆసియా దివ్యాంగుల క్రీడల్లో భారత క్రీడాకారులు పతకాల వేట కొనసాగిస్తున్నారు. పురుషుల 400 మీటర్ల పరుగు పోటీలో సందీప్ ప్రపంచ రికార్డుతో స్వర్ణ పతకాన్ని సాధించాడు. మరో భారత క్రీడాకారుడు అజయ్ కుమార్ కాంస్య పతకాన్ని దక్కించుకున్నాడు. సందీప్ 52.28 సెకన్లలో గమ్యాన్ని చేరగా, అజయ్ కుమార్ 53.61 సెకన్లలో పరుగు పూర్తి చేశాడు. ఈ విజయాలతో భారత పతకాల సంఖ్య వంద దాటింది. **దేశానికి గర్వకారణంగా క్రీడాకారులు** వైకల్యాలను అధిగమించి అంతర్జాతీయ వేదికలపై భారత క్రీడాకారులు సాధిస్తున్న విజయాలు దేశానికి గర్వకారణంగా నిలుస్తున్నాయి. నిరంతర సాధన, పట్టుదల, ఆత్మవిశ్వాసంతో వారు ప్రపంచ రికార్డులను తిరగరాస్తున్నారు. హనీ సాధించిన స్వర్ణ పతకం దేశవ్యాప్తంగా యువ క్రీడాకారులకు స్ఫూర్తినివ్వనుంది. భవిష్యత్తులోనూ మరిన్ని అంతర్జాతీయ పోటీల్లో భారత క్రీడాకారులు విజయాలు సాధించాలని అభిమానులు ఆకాంక్షిస్తున్నారు.

# ఇషాన్ కిషన్‌కు గాయం.. రెండో టీ20కి దూరం!

### న్యూజిలాండ్‌తో పోరుకు అందుబాటులో లేని భారత వికెట్ కీపర్.. వైభవ్ సూర్యవంశీకి జట్టులో చోటు దక్కే అవకాశం



**క్రైస్ట్‌చర్చ్:** న్యూజిలాండ్‌తో జరుగుతున్న ఐదు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌లో భారత జట్టుకు గట్టి ఎదురుదెబ్బ తగిలింది. తొలి టీ20లో గాయపడిన భారత వికెట్ కీపర్, బ్యాటర్ ఇషాన్ కిషన్ రెండో టీ20 మ్యాచ్‌కు దూరమయ్యాడు. కుడి తొడ లోపలి కండరానికి స్వల్ప గాయం కావడంతో అతడు ఈ మ్యాచ్‌లో ఆడటం లేదని భారత క్రికెట్ నియంత్రణ మండలి వెల్లడించింది. ప్రస్తుతం వైద్య బృందం అతడి గాయం తీవ్రతను పరిశీలిస్తూ, కోలుకునే పరిస్థితిని పర్యవేక్షిస్తోంది. ఇషాన్ గాయం కారణంగా రెండో టీ20లో భారత తుది జట్టు కూర్పులో మార్పులు చోటుచేసుకునే అవకాశాలు కనిపిస్తున్నాయి. **తొలి మ్యాచ్‌లోనే గాయం** న్యూజిలాండ్‌తో గురువారం జరిగిన తొలి టీ20లో ఇషాన్ కిషన్ గాయానికి గురయ్యాడు. ఈ మ్యాచ్‌లో అతడు సాధారణంగా ఆడే స్థానంలో కాకుండా ఐదో స్థానంలో బ్యాటింగ్‌కు దిగడం గమనార్హం. తొలి వికెట్ పడిన తర్వాత తిలక్ వర్మ, శ్రేయస్ అయ్యర్ ముందుగా బ్యాటింగ్‌కు రావడానికి ఇషాన్ గాయమే కారణమని భారత జట్టు బ్యాటింగ్ కోచ్ వెల్లడించాడు. గాయం కారణంగా ఇషాన్ ఇబ్బంది పడుతున్న నేపథ్యంలో రెండో మ్యాచ్‌కు అతడు అందుబాటులో ఉండటం కష్టమని ముందుగానే సంకేతాలు వెలువడ్డాయి. తాజాగా భారత క్రికెట్ నియంత్రణ మండలి ప్రకటనతో అతడు రెండో టీ20కి దూరమైన విషయం స్పష్టమైంది. **వైభవ్ సూర్యవంశీకి అవకాశం?** ఇషాన్ కిషన్ దూరం కావడంతో యువ సంచలనం వైభవ్ సూర్యవంశీకి తుది జట్టులో చోటు దక్కే అవకాశాలు పెరిగాయి. ఇటీవల తన దూకుడైన బ్యాటింగ్‌తో క్రికెట్ అభిమానుల దృష్టిని ఆకర్షించిన వైభవ్, భారత జట్టులో మరోసారి తన సత్తా చాటేందుకు ఎదురుచూస్తున్నాడు. వెస్టిండీస్‌తో జరిగిన టీ20 సిరీస్‌లో అతడికి తుది జట్టులో ఆడే అవకాశం లభించలేదు. ఇప్పుడు ఇషాన్ గాయం కారణంగా ఏర్పడిన ఖాళీని భర్తీ చేసేందుకు జట్టు యాజమాన్యం వైభవ్ పేరును పరిశీలించే అవకాశం ఉంది. అయితే అతడికి తుది జట్టులో చోటు కల్పిస్తారా లేదా అన్నది జట్టు ఎంపికపై ఆధారపడి ఉంటుంది. **తొలి మ్యాచ్‌లో భారత్ అద్భుత విజయం** న్యూజిలాండ్‌తో జరిగిన తొలి టీ20లో భారత జట్టు అద్భుతంగా రాణించింది. తొలుత బ్యాటింగ్ చేసిన ఆతిథ్య జట్టు నిర్ణీత ఓవర్లలో నాలుగు వికెట్ల నష్టానికి 225 పరుగుల భారీ స్కోరు సాధించింది. గ్లెన్ ఫిలిప్స్ అజేయంగా 82 పరుగులు చేయగా, ఫిన్ అలెన్ 45 పరుగులతో ఆకట్టుకున్నాడు. భారీ లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో భారత్‌కు సంజూ శాంసన్ 67 పరుగులతో శుభారంభం అందించాడు. అనంతరం శ్రేయస్ అయ్యర్ 42 పరుగులు, నామన్ ధీర్ అజేయంగా 42 పరుగులు చేసి జట్టు విజయంలో కీలక పాత్ర పోషించారు. దీంతో భారత్ మరో రెండు బంతులు మిగిలి ఉండగానే ఆరు వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించింది. నాలుగు వికెట్ల తేడాతో విజయం సాధించి ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో 10 ఆధిక్యంలో నిలిచింది. **రెండో టీ20పై ఆసక్తి** తొలి మ్యాచ్‌లో విజయం సాధించిన భారత జట్టు అదే జోరును కొనసాగించాలని భావిస్తోంది. మరోవైపు న్యూజిలాండ్ జట్టు సిరీస్‌ను సమం చేయాలనే పట్టుదలతో బరిలోకి దిగనుంది. ఇషాన్ కిషన్ గైర్హాజరు భారత బ్యాటింగ్ కూర్పుపై ప్రభావం చూపే అవకాశం ఉంది. అతడి స్థానంలో ఎవరిని ఎంపిక చేస్తారన్నది ఆసక్తికరంగా మారింది. వైభవ్ సూర్యవంశీకి అవకాశం లభిస్తే తన ప్రతిభను నిరూపించుకునేందుకు మంచి వేదికగా నిలవనుంది. అయితే గాయం నుంచి ఇషాన్ ఎప్పుడు పూర్తిగా కోలుకుంటాడనే విషయంపై వైద్య బృందం నుంచి తదుపరి సమాచారం రావాల్సి ఉంది.

# ప్రపంచ రికార్డుతో సందీప్‌కు స్వర్ణ పతకం

### ఆసియా దివ్యాంగుల క్రీడల్లో 400 మీటర్ల పరుగులో అద్భుతం.. భారత కీర్తిని చాటిన అథ్లెట్

**నాగోయా:** ఆసియా దివ్యాంగుల క్రీడల్లో భారత క్రీడాకారులు అద్భుత విజయాలతో దూసుకెళ్తున్నారు. పురుషుల 400 మీటర్ల పరుగు పోటీలో భారత అథ్లెట్ సందీప్ కుమార్ ప్రపంచ రికార్డు సృష్టించి స్వర్ణ పతకాన్ని కైవసం చేసుకున్నాడు. అత్యంత వేగంగా పరుగెత్తి ప్రత్యర్థులను వెనక్కి నెట్టిన సందీప్ తన అసాధారణ ప్రతిభతో భారత కీర్తిని అంతర్జాతీయ స్థాయిలో చాటాడు. ఈ విజయంతో భారత క్రీడా బృందంలో ఆనందోత్సాహాలు నెలకొన్నాయి. **52.28 సెకన్లలో గమ్యానికి** పురుషుల 400 మీటర్ల టీ44 విభాగంలో జరిగిన తుది పోటీలో సందీప్ కుమార్ అద్భుత వేగాన్ని ప్రదర్శించాడు. నిర్ణీత దూరాన్ని కేవలం 52.28 సెకన్లలో పూర్తి చేసి ప్రపంచ రికార్డును నెలకొల్పాడు. పోటీ ప్రారంభం నుంచే వేగాన్ని కొనసాగించిన సందీప్, చివరి వరకు అదే పట్టుదలను ప్రదర్శించి అగ్రస్థానాన్ని దక్కించుకున్నాడు. ఈ ప్రదర్శనతో స్వర్ణ పతకాన్ని సాధించడమే కాకుండా తన పేరును ప్రపంచ రికార్డుల జాబితాలో నమోదు చేసుకున్నాడు. **అజయ్ కుమార్‌కు కాంస్యం** ఇదే పోటీలో మరో భారత క్రీడాకారుడు అజయ్ కుమార్ కూడా పతకం సాధించాడు. 400 మీటర్ల పరుగును 53.61 సెకన్లలో పూర్తి చేసి కాంస్య పతకాన్ని అందుకున్నాడు. ఒకే పోటీలో ఇద్దరు భారత క్రీడాకారులు పతకాలు సాధించడం విశేషంగా నిలిచింది. సందీప్ స్వర్ణం, అజయ్ కాంస్యంతో భారత పతకాల ఖాతాలో మరో రెండు పతకాలు చేరాయి. వీరిద్దరి ప్రదర్శన భారత క్రీడాభిమానుల్లో ఉత్సాహాన్ని నింపింది. **పట్టుదలతో విజయ శిఖరాలకు** దివ్యాంగుల క్రీడల్లో పాల్గొనే క్రీడాకారులు అనేక సవాళ్లను అధిగమిస్తూ నిరంతరం సాధన చేస్తుంటారు. శారీరక పరిమితులను అధిగమించి అంతర్జాతీయ వేదికలపై ప్రతిభను చాటడం వారి కఠోర శ్రమకు నిదర్శనం. సందీప్ కుమార్ సాధించిన ప్రపంచ రికార్డు యువ క్రీడాకారులకు స్ఫూర్తినిచ్చే విజయంగా నిలుస్తోంది. లక్ష్యంపై ఏకాగ్రత, క్రమశిక్షణ, నిరంతర సాధన ఉంటే అసాధ్యమనుకున్న లక్ష్యాలను సైతం సాధించవచ్చని ఆయన నిరూపించాడు.




**భారత పతకాల సంఖ్యకు మరింత బలం** ఆసియా దివ్యాంగుల క్రీడల్లో భారత క్రీడాకారులు పలు విభాగాల్లో పతకాలు సాధిస్తూ దేశ ప్రతిష్ఠను పెంచుతున్నారు. పరుగుపందేలు, భల్లెం విసురు, చక్రం విసురు వంటి పోటీల్లో భారత క్రీడాకారులు రాణించడం విశేషం. సందీప్ కుమార్ ప్రపంచ రికార్డుతో స్వర్ణ పతకం సాధించడం భారత బృందానికి మరింత ఉత్సాహాన్నిచ్చింది. అంతర్జాతీయ పోటీల్లో భారత క్రీడాకారుల ప్రతిభకు లభిస్తున్న గుర్తింపు భవిష్యత్తులో మరిన్ని విజయాలకు మార్గం సుగమం చేయనుంది.

ప్రజా వినికిడి
మా అక్షరం-మీ ఆయుధం తెలుగు దినపత్రిక



# ప్రియదర్శి, నాగదుర్గ

## 'ఇడుపు కాయితం' విడుదల తేదీ ఖరారు



ప్రియదర్శి, నాగదుర్గ కీలక పాత్రల్లో నటిస్తున్న ఫ్యామిలీ డ్రామా 'ఇడుపు కాయితం' విడుదల తేదీ ఖరారైంది. వంశీరెడ్డి దొండపాటి దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని డిసెంబరు 11న ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నట్లు చిత్ర బృందం ప్రకటించింది. సుకుమార్ రైటింగ్స్‌తో కలిసి బన్నీ వాస్ వర్క్స్ పతాకంపై బన్నీ వాస్ ఈ సినిమాను నిర్మిస్తున్నారు. టైటిల్ ప్రకటనతోనే ఆసక్తి రేకెత్తించిన ఈ చిత్రం తెలంగాణ కుటుంబ నేపథ్యంతో తెరకెక్కుతోంది.విడుదల తేదీ ప్రకటన నేపథ్యంలో శుక్రవారం చిత్ర బృందం 'గడప' పాట లిరికల్ వీడియోను విడుదల చేసింది. సురేశ్ బొబ్బిలి సంగీతం అందించిన ఈ పాటకు అభినయ శ్రీనివాస్ సాహిత్యం రాశారు. తేలు విజయ ఆలపించారు. 'ఇడుపు కాయితం' అంటే విడాకుల పత్రం అని అర్థం. ఈ పేరుతో రూపొందుతున్న సినిమా కుటుంబ సంబంధాలు, వాటి చుట్టూ సాగే కథతో ప్రేక్షకుల ముందుకు రానుంది.

# మితిమీరిన స్కిన్ షో చేయడం నాకు ఇష్టం ఉండదు

## : రష్మిక మందన్న



టాలీవుడ్, బాలీవుడ్‌లో స్టార్ హీరోయిన్‌గా రాణిస్తున్న రష్మిక మందన్న, సినిమాల్లో దుస్తుల విషయంలో తనకంటూ కొన్ని హద్దులు ఉన్నాయని స్పష్టం చేశారు. మితిమీరిన స్కిన్ షో, ఎక్స్‌పోజింగ్‌తో కూడిన దుస్తులు ధరించడానికి తాను ఇష్టపడనని తేల్చిచెప్పారు. ఇటీవల నటుడు విజయ్ దేవరకొండతో కలిసి ఆమె ప్రముఖ టాక్ షో 'కాఫీ విత్ కరణ్'లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా తన వృత్తిపరమైన పరిమితులపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు."కథ ప్రకారం కొన్నిసార్లు బికినీ వంటివి ధరించాల్సి రావచ్చు. కానీ, శరీర ప్రదర్శన ఎక్కువగా ఉండే దుస్తులు ధరించడం నాకు సౌకర్యంగా ఉండదు. నేను అలాంటి వ్యక్తిని కాదు" అని రష్మిక అన్నారు. ఏ సినిమా అయినా ఒప్పుకునే ముందు ఈ విషయంపై దర్శకులతో స్పష్టంగా మాట్లాడతానని, నటీనటుల సౌకర్యానికి విలువ ఇచ్చే దర్శకులతోనే పనిచేయడానికి ప్రాధాన్యత ఇస్తానని వివరించారు. ఈ విషయంలో నటుడు విజయ్ దేవరకొండ తనకు మద్దతుగా ఉంటారని, కొన్నిసార్లు ఆయన సలహా తీసుకుంటానని కూడా రష్మిక తెలిపారు. దీనిపై విజయ్ స్పందిస్తూ, "నటీనటులు ఇబ్బందికర దుస్తులు వేసుకోమని చెప్పినప్పుడు, 'మీరు నటులు, ఇది మీ పని కదా' అంటూ ఒత్తిడి చేస్తారు. అలాంటప్పుడు వారికి అండగా నిలవాల్సిన అవసరం ఉంది" అని అభిప్రాయపడ్డారు. గ్లామర్ కోసం తన వ్యక్తిగత హద్దులు దాటనని రష్మిక చేసిన వ్యాఖ్యలను నెటిజన్లు ప్రశంసిస్తున్నారు.

# 'కల్కి 2'లో భైరవగా ప్రభాస్..

## బర్త్‌డే స్పెషల్ వీడియోతో అంచనాలు పెంచిన మేకర్స్!



'కల్కి 2898 ఏడీ'లో భైరవగా ప్రేక్షకులను అలరించిన ప్రభాస్.. ఇప్పుడు సీక్వెల్‌లోనూ అదే పాత్రలో సందడి చేసేందుకు సిద్ధమయ్యాడు. 'కల్కి 2' షూటింగ్‌లో ఆయన పాల్గొంటున్నాడు. ప్రభాస్ భైరవగా తిరిగి సెట్స్‌లో అడుగుపెట్టడంతో ఈ సినిమా కోసం ఎదురుచూస్తున్న అభిమానుల్లో ఆసక్తి పెరుగుతోంది.

దర్శకుడు నాగ్ అశ్విన్ తెరకెక్కిస్తున్న ఈ చిత్రానికి సంబంధించి ప్రభాస్ పుట్టినరోజు సందర్భంగా ప్రత్యేక తెరవెనుక వీడియోను విడుదల చేశారు. ఇందులో భైరవగా ప్రభాస్ కనిపించడంతో పాటు, సినిమా కోసం రూపొందిస్తున్న భారీ సెట్ కూడా చూపించారు. సీక్వెల్‌పై ఈ వీడియో అంచనాలను మరింత పెంచుతోంది.'కల్కి 2898 ఏడీ'లో తన స్టైల్, హాస్యంతో కూడిన డైలాగులు, నటనతో భైరవ పాత్రకు ప్రభాస్ ప్రత్యేక గుర్తింపు తీసుకొచ్చాడు. ఇప్పుడు సీక్వెల్‌లోనూ ఆ పాత్రను కొనసాగిస్తూ.. కల్కి ఆగమనానికి సంబంధించిన తన లక్ష్యాన్ని ముందుకు తీసుకెళ్లనున్నట్లు చిత్రబృందం వెల్లడించింది.

ఈ సినిమాలో అమితాబ్ బచ్చన్ అశ్వత్థామగా, కమల్ హాసన్ సుప్రీమ్ యాస్కిన్‌గా తిరిగి కనిపించనున్నారు. వైజయంతీ మూవీస్ ప్రతిష్ఠాత్మకంగా నిర్మిస్తున్న ఈ చిత్రంలో భారతీయ సినిమాలో ఇంతకు ముందెన్నడూ చూడని స్థాయి విజువల్స్‌ను చూపించనున్నట్లు నిర్మాతలు తెలిపారు. సినిమాకు సంబంధించిన మరిన్ని వివరాలను త్వరలో వెల్లడించనున్నారు.

# 'రామాయణ' ముందు భారీ సవాల్..



భారత సినీ పరిశ్రమలో అత్యంత భారీ బడ్జెట్‌తో, ఎంతో ప్రతిష్ఠాత్మకంగా తెరకెక్కుతున్న చిత్రం 'రామాయణ: పార్ట్ 1'. నితీశ్ తివారీ దర్శకత్వంలో వస్తున్న ఈ సినిమా బడ్జెట్ దాదాపు రూ. 2000 కోట్లుగా ప్రచారంలో ఉంది. ఈ స్థాయిలో భారీ పెట్టుబడి పెట్టినప్పుడు, సినిమా లాభాల బాట పట్టడం అంత సులభం కాదు. ట్రేడ్ విశ్లేషకుల అంచనాలను ఉటంకిస్తూ ఇండియా టుడే కథనం ప్రకారం.. ఈ సినిమా పెట్టిన పెట్టుబడిని తిరిగి రాబట్టి లాభాల్లోకి వెళ్లాలంటే ప్రపంచవ్యాప్తంగా కనీసం రూ. 5000 కోట్ల గ్రాస్ వసూళ్లను సాధించాల్సి ఉంటుంది. సాధారణంగా బడ్జెట్‌కు 2.5 రెట్ల వసూళ్లు వస్తేనే సినిమాను విజయవంతమైనదిగా పరిగణిస్తారు.ఈ భారీ లక్ష్యాన్ని చేరుకోవాలంటే సినిమాకు ఆకాశమంత ఓపెనింగ్స్ అవసరమని ట్రేడ్ నిపుణుడు రమేశ్ బాల అభిప్రాయపడ్డారు. దేశీయంగా అడ్వాన్స్ బుకింగ్స్ ద్వారానే రూ. 75 కోట్ల నుంచి రూ. 100 కోట్లు, ప్రపంచవ్యాప్తంగా ప్రీ-సేల్స్ ద్వారా రూ. 150 కోట్ల నుంచి రూ. 200 కోట్లు వసూలు చేయడం ఆరంభానికి ఎంతో కీలకమని ఆయన విశ్లేషించారు.

ఇక, తొలిరోజు భారత్‌లో రూ. 100-125 కోట్ల నెట్ కలెక్షన్లు, ప్రపంచవ్యాప్తంగా రూ. 175-200 కోట్ల గ్రాస్ వసూళ్లు సాధిస్తే, సినిమాకు బలమైన పునాది పడుతుందని భావిస్తున్నారు. దేశీయ వసూళ్లలో దక్షిణాది మార్కెట్ల నుంచి 35-40 శాతం ఉంటుందని అంచనా వేస్తున్నారు.

అక్టోబర్ 22 నాటికి పరిమిత సంఖ్యలో అందుబాటులో ఉన్న షోల కోసం జరిగిన అడ్వాన్స్ బుకింగ్స్ ద్వారా సుమారు 1.33 లక్షల టికెట్లు అమ్ముడయ్యాయి. దీని ద్వారా రూ. 7.52 కోట్లు సమకూరాయి. అయితే, భారీ బడ్జెట్ చిత్రం కావడంతో కేవలం ఓపెనింగ్స్ మీదే ఆధారపడలేరు. సినిమాకు మంచి మౌత్ టాక్ వస్తేనే లాంగ్ రన్‌లో నిలదొక్కుకోగలదు. కేవలం థియేట్రికల్ వసూళ్లే కాకుండా, శాటిలైట్, డిజిటల్, ఇతర హక్కుల అమ్మకాల ద్వారా కూడా నిర్మాతలకు పెద్ద మొత్తంలో ఆదాయం సమకూరనుంది.

రణ్‌బీర్ కపూర్ రాముడిగా, సాయిపల్లవి సీతగా, యశ్ రావణుడిగా, రవి దూబే లక్ష్మణుడిగా నటిస్తున్న ఈ చిత్రాన్ని యశ్ నిర్మాణ సంస్థ మాన్‌స్టర్ మైండ్ క్రియేషన్స్, నమిత్ మల్హోత్రాకు చెందిన ప్రైమ్ ఫోకస్ స్టూడియోస్ సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. ఈ సినిమాను నవంబర్ 5న దీపావళి కానుకగా ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయనుండగా, నవంబర్ 4న ప్రత్యేక ప్రీమియర్ షోలు ప్రదర్శించనున్నారు.

# 'నా వైఫ్ మిస్సింగ్'

## : చాలా ఏళ్ల తర్వాత మళ్లీ వరుణ్‌తో..

## శ్వేతాబసు ప్రసాద్ ఆనందం



'కొత్త బంగారు లోకం' చిత్రంతో తెలుగు ప్రేక్షకులను అలరించిన నటి శ్వేతా బసు ప్రసాద్, సుదీర్ఘ విరామం తర్వాత మళ్లీ తెలుగు తెరపైకి పునరాగమనం చేశారు. 'ఆహా' ఓటీటీ వేదికగా రూపొందిన 'నా వైఫ్ మిస్సింగ్' అనే వెబ్ సిరీస్ ద్వారా ఆమె రీఎంట్రీ ఇచ్చారు. ఇది తనకు లభించిన ఒక అద్భుతమైన అవకాశమని, తిరిగి టాలీవుడ్‌లోకి రావడం సొంత ఇంటికి వచ్చినట్లుగా ఉందని ఆమె సంతోషం వ్యక్తం చేశారు.ఈ సిరీస్ ప్రమోషన్లలో భాగంగా నిర్వహించిన విలేకరుల సమావేశంలో శ్వేతా బసు ప్రసాద్ మాట్లాడుతూ, "చాలా ఏళ్ల తర్వాత మళ్లీ తెలుగులో నటించడం ఎంతో సంతోషంగా ఉంది. ఈ వెబ్ సిరీస్ నా కెరీర్‌కు మంచి పునరాగమనం అవుతుందని భావిస్తున్నాను. ఇందులో నేను పోషించిన 'స్వప్న' అనే పాత్ర ఎంతో శక్తిమంతంగా ఉండటంతో వెంటనే నటించడానికి అంగీకరించాను" అని పేర్కొన్నారు. 'కొత్త బంగారు లోకం' తర్వాత మళ్లీ వరుణ్ సందేశ్‌తో కలిసి పనిచేయడంపై స్పందిస్తూ, "వరుణ్ నా సోల్ మేట్. ఇన్నేళ్ల తర్వాత మళ్లీ అతనితో కలిసి నటించడం ఒక మధురానుభూతి" అని అన్నారు.గత కొన్నేళ్లుగా తెలుగు చిత్ర పరిశ్రమకు దూరంగా ఉన్న శ్వేతా బసు ప్రసాద్, ప్రధానంగా హిందీ సినిమాలు, వెబ్ సిరీస్‌లపై దృష్టి కేంద్రీకరించారు. దర్శకురాలు స్వాతి అంకితభావంతో పనిచేసే వ్యక్తి అని, ఆమెతో కలిసి పనిచేయడం ఎంతో సంతోషాన్ని ఇచ్చిందని శ్వేత తెలిపారు. ఈ అవకాశం కల్పించిన 'ఆహా' యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలుపుతూ, ప్రేక్షకులందరూ ఈ సిరీస్‌ను ఆదరిస్తారని ఆకాంక్షించారు. కాగా, ఈ వెబ్ సిరీస్ ప్రస్తుతం తెలుగుతో పాటు తమిళ భాషలోనూ 'ఆహా' ఓటీటీలో అందుబాటులో ఉంది.

# రాజకీయాల్లోకి వెళ్లి ఆస్తులు అమ్ముకున్నా: నరేశ్

సీనియర్ నటుడు నరేశ్ తన రాజకీయ జీవితం గురించి, దానివల్ల ఎదుర్కొన్న ఆర్థిక ఇబ్బందుల గురించి సంచలన విషయాలు వెల్లడించారు. రాజకీయాల్లోకి వెళ్లడం వల్ల ఆర్థికంగా తీవ్రంగా నష్టపోయానని, ఆ నష్టాలను పూడ్చుకోవడానికి సొంత ఆస్తులను సైతం అమ్ముకోవాల్సి వచ్చిందని ఆయన తెలిపారు.హీరోగా మంచి అవకాశాలు వస్తున్న సమయంలోనే ప్రజాసేవ చేయాలనే ఉద్దేశంతో రాజకీయాల్లోకి అడుగుపెట్టానని నరేశ్ చెప్పారు. డబ్బు సంపాదన తన లక్ష్యం కాదని, పార్టీ కార్యక్రమాలు, సామాజిక సేవా కార్యక్రమాల కోసం పెద్ద మొత్తంలో సొంత డబ్బు ఖర్చు చేశానని చెప్పారు. అదనపు ఆదాయం కోసం ప్రారంభించిన అడ్వర్టైజింగ్ ఏజెన్సీ వంటి వ్యాపారాలు కూడా ఆశించిన ఫలితాలు ఇవ్వలేదని వివరించారు.

తన ఉదార స్వభావం కూడా ఆర్థిక ఇబ్బందులకు ఒక కారణమని నరేశ్ అంగీకరించారు. 1998లో రాజకీయాల్లో పూర్తిగా చురుకుగా మారిన తర్వాత దాదాపు 12 నుంచి 15 ఏళ్ల పాటు సినిమాలకు దూరంగా ఉన్నానని తెలిపారు. చిన్నప్పటి నుంచే ఆర్ఎస్ఎస్, బీజేపీ సిద్ధాంతాల పట్ల ఆకర్షితుడినయ్యానని, హిందూపురం లోక్‌సభ స్థానం నుంచి ఎంపీ అభ్యర్థిగా పోటీ చేశానని కూడా ఆయన గుర్తుచేసుకున్నారు. ఆ సమయంలో సంపాదించిన డబ్బును భూముల వంటి స్థిరాస్తులపై పెట్టుబడి పెట్టి ఉంటే పరిస్థితి మరోలా ఉండేదని నరేశ్ అభిప్రాయపడ్డారు



Printed , Published and Owned by Marepally Ashok , Printed at Dilip Offset Printers, H.NO. 4-110, Durga Nagar, Dilsukhnagar, Hyderabad , Ranga Reddy District -500060 and Published from H. No 18-353/1,Vijaya Nagar Colony, Hajipally Road, Farooq Nagar, Ranga Reddy District — 509216 Telangana State. Editor : Marepally Ashok, RNI.No :TELTEL/2023/85745. E mail id : ashok.laghs123@gmail.com. Cell. No: 8978701613